Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 15 మేడ్చల్ మల్కాజ్‌గిరి 8 ఫిబ్రవరి 2024 గురువారం పేజీలు : 4

## పాక్ సంక్షోభం.. కనిష్ఠ స్థాయికి పడిపోయిన రూపాయి

ఇస్లామాబాద్: తీవ్ర ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కేం దుకు వీలుగా అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి రుణాలు పొం దేందుకు పాక్ తీవ్ర ప్ర యత్నాలు చేస్తోంది. తాజా పాకిస్థాన్ రూపా యి మారకపు రేటుపై నిబంధనను సరళతరం చేసింది. దీంతో డాలరుతో పాక్ రూపాయి మారకపు విలువ 255కి పడిపోయింది. పాక్ చరిత్రలో ఇంత పెద్దమొత్తంలో రూపాయి పతనం కావడం ఇదే తొలిసారి. ఐఎంఎఫ్ సూచన మేరకు పాకిస్థాన్ ద్రవ్యమారకపు రేటుపై నిబంధనలను సడలించింది. దీంతో ఒక్క రోజులోనే పాక్ రూపాయి రూ. 24 మేర క్షీణించినట్లు ట్రిబ్యూన్ వెల్లడించింది. రూపాయిపై పాక్ ప్రభుత్వం నియంత్రణలను సరళీకరించాలని, రూపాయి మారకపు విలువను మార్కెట్ నిర్ణయించేలా చూడాలని ఐఎంఎఫ్ పాకిస్థాన్‌ను కోరింది.




## ఆలోచనల్లో కాంగ్రెస్ అవుట్‌డేటెడ్ అయింది, అందుకే అవుట్ సోర్సింగ్ ఇస్తోంది

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీపై మరోసారి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి విమర్శలు గుప్పించారు. ఆలోచనల్లో కాంగ్రెస్ పార్టీ అవుట్‌డేటెడ్ అయిందని, అందుకే అవుట్ సోర్సింగ్ ఇస్తోందని అన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 40 సీట్లు కూడా రావని పశ్చిమబెంగాల్‌లోని ఒక పార్టీ సవాలు చేసిందని గుర్తుచేశారు. బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగంపైం ధన్యవాద తీర్మానంపై చర్చకు రాజ్యసభలో ప్రధాని బుధవారంనాడు సమాధానమిస్తూ, గతంలో జరిగిన సంఘటనలు కూడా తనకు గుర్తున్నాయని, రాజ్యసభలో మాట్లాడాలనుకున్నప్పుడు తన ప్రసంగాన్ని అడ్డుకున్నారని, అయినప్పటికీ తాను ప్రసంగాన్ని కొనసాగించానని అన్నారు. ఇవాళ కూడా తన మాటలు వినేందుకు వారు సిద్ధంగా లేరనే విషయం తనకు తెలుసునని అన్నారు. అయితే తన గొంతును ఎవరూ అణిచివేయలేరని, ఈ గొంతుకు ప్రజలే బలం ఇచ్చారని, ఈసారి కూడా తాను సన్నద్ధంగానే వచ్చానని చెప్పారు.

**ఖర్గేను అక్కడ మిస్సయ్యాను..** కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు తాను ధన్యవాదాలు చెప్పకుండా ఉండలేనని మోదీ అన్నారు. లోక్‌సభలో ఆయనను మిస్ అయ్యామని, అయితే రాజ్యసభలో ఆయనను చూసి ఆనందం కలిగిందని అన్నారు. లోక్‌సభలో మిస్ అయిన ఎంటర్‌టైన్‌మె ంట్ తిరిగి పొందానని అన్నారు. ఆయనే స్వయంగా బీజేపీకి 400కి పైగా సీట్లు వస్తాయని ఆశీర్వదించారని నవ్వుతూ మోదీ చెప్పారు.

**కాంగ్రెస్‌కు స్ఫూర్తి బ్రిటిషర్లే..** కాంగ్రెస్ ఎప్పుడూ బీసీలు, ఎస్సీల కోటాకు వ్యతిరేకమని, బ్రిటిష్ వారు ఆ పార్టీకి స్ఫూర్తి అని అన్నారు. బ్రిటిషన్ వారి బానిసత్వ చిహ్నాలను దశాబ్దాల పాటు కొనసాగించారని ప్రధాని విమర్శించారు. దేశాన్ని కష్టకాలం నుంచి తమ ప్రభుత్వం బయటకు తెచ్చిందని, సమస్యలను అధిగమించామని అన్నారు. భారతదేశానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన ప్రసంగంలో చెప్పడాన్ని ప్రశంసించారు. భారతదేశ సత్తా, పటిష్టత, భవిష్యత్తుపై ధీమా వ్యక్తం చేసిన రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలుపుకొంటున్నానని ప్రధాని అన్నారు.

**'కావాలని చేశారు'.. ప్రైవేటైజేషన్‌పై ప్రధాని మోదీ హాట్ కామెంట్స్..!** : అసలే ఎన్నికల కాలం.. అందివచ్చిన అవకాశాన్ని ప్రధాని మోదీ వదిలిపెడతారా? ఛాన్సే లేదు. వేదిక ఏదైనా తనకు అనుకూలంగా మార్చుకోవడంలో ప్రధాని నరేంద్ర మోదీ చాలా నేర్పరి. ఇంకేముంది.. ఈ ప్రభుత్వ కాలంలో చివరి బడ్జెట్ సమావేశాలు కావడంతో పార్లమెంట్ వేదికగా ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీని ఉక్కిరిబిక్కిరి చేశారు. తన వాక్చాతుర్యంతో.. కాంగ్రెస్ పార్టీపై ఓ రేంజ్‌లో విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వంపై చేసిన ఆరోపణలు తిప్పికొట్టడమే కాకుండా.. వాటంతటికీ కారణం ఆ పార్టీనే అని ఫైర్ అయ్యారు. బుధవారం నాడు రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై నెక్స్ట్ లెవెల్‌లో కామెంట్స్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసినట్టు.. కాంగ్రెస్ పార్టీ తమపై అసత్యప్రచారం చేసిందన్నారు. తానూ స్వతంత్ర భారతంలో పుట్టానని, తన ఆలోచనలు కూడా స్వతంత్రంగానే ఉంటాయన్నారు మోదీ. బానిసత్వానికి తాను పూర్తిగా వ్యతిరేకం అని స్పష్టం చేశారాయన. BSNL, HAL, MTNL, ఎయిర్ ఇండియా సంస్థలను కాంగ్రెస్ నాశనం చేసింది కాంగ్రెస్ పార్టీనే అని ప్రధాని ఆరోపించారు. ఇప్పుడు తమ ప్రభుత్వ హయాంలో BSNLî 5%G కూడా తీసుకొచ్చామన్నారు. HAL కూడా లాభాల్లో నడుస్తోందన్నారు. LIC మూతపడుతుందని కాంగ్రెస్ పుకార్లు పుట్టించిందని, కానీ, ఇప్పుడు LIC షేర్ ధర రికార్డ్ స్థాయిలో ఉందని లెక్కలతో సహా వివరించారు. ప్రభుత్వరంగ సంస్థల ఆస్తులు రూ. 9 లక్షల కోట్ల నుంచి.. రూ. 75 లక్షల కోట్లకు పెంచామని చెప్పారు.



## మెట్రోలో ప్రయాణించిన రాష్ట్రపతి.. విద్యార్థులతో ఏం మాట్లాడారంటే

ఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం మెట్రోలో ప్రయాణించారు. ఇవాళ ఉదయం ఢిల్లీ మెట్రో వద్దకు చేరుకుని టికెట్ తీసుకుని ట్రైన్లో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పరీక్షల సమయం కావడంతో ధైర్యంగా ఉండాలని, ఒత్తిడికి లోనుకాకుడదని సూచించారు. పరీక్షల్లో మంచి ప్రతిభ చూపేందుకు సూచనలు చేశారు. ఆ తరువాత పలువురు ప్రయాణికులతో మాట్లాడారు. రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆ హోదాలో మెట్రోలో ప్రయాణించడం ఇదే తొలిసారి.



## విదేశాల్లో ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: అమెరికా సహా ఇతర దేశాల్లో నివసిస్తోన్న తెలంగాణ విద్యార్థులు, యువత కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. చికాగోలో హైదరాబాద్ విద్యార్థి సయ్యద్ మజాహిర్‌పై దాడి, ఒహియోలో శ్రేయాస్‌రెడ్డి హత్య కలవర పెడుతున్నాయని సీఎం ట్వీట్ చేశారు. తమ ఆందోళనను అమెరికాకు తెలపాలని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌ను కోరారు. తెలంగాణ ప్రజలు ఈ భూమిపై ఎక్కడ ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం పేర్కొన్నారు. అమెరికా లో ఉన్నత విద్య కోసం వెళ్లిన హైదరాబాద్ విద్యార్థి సయ్యద్ మజాహిర్ అలీపై దాడి జరిగిన విషయం తెలిసిందే. మంగళవారం రాత్రి అతడు హోటల్ నుంచి ఇంటికెళ్తుండగా ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. తల, ముక్కు, కళ్లపై గాయాలయ్యాయి. తనపై జరిగిన దాడిని వీడియో ద్వారా వెల్లడించాడు. తనకు సాయం చేయాలని భారత ప్రభుత్వాన్ని, అగ్రరాజ్యంలోని మన దౌత్య సిబ్బందిని అభ్యర్థించారు. దీంతో అతడి పరిస్థితిపై హైదరాబాద్‌లో ఉంటున్న కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తన భర్తకు సాయం చేయాలంటూ అలీ భార్య ఫాతిమా రిజ్వి జైశంకర్‌కు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో సీఎం స్పందించారు.

## హైదరాబాద్ వాసులకు ఇక చుక్కలే..!

## ఈ సారి నిప్పుల కుంపటే..!!

హైదరాబాద్ : ఈసారి చలికాలంలో చలి ఎక్కువగా లేనప్పటికీ.. ఎండలు మాత్రం విపరీతంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఫిబ్రవరిలోనే ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి. ముఖ్యంగా మధ్యాహ్నం ఉష్ణోగ్రత పెరుగుతోంది. సాధారణం కంటే మూడు నాలుగు డిగ్రీలు ఎక్కువ ఉష్ణోగ్రతు నమోదువుతున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. మార్చి, ఏప్రిలో, మేలో కూడా ఎండలు మండిపోయే అవకాశం ఉందని వివరించింది. మంగళవారం హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మొండా మార్కెట్. సరూర్ నగర్ సో గరిష్ఠంగా 36.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా.. బాలానగర్ లో 35.9 ఉష్ణోగ్రత నమోదయింది.

మధ్యాహ్నమే కాదు రాత్రి ఉష్ణోగ్రతులు కూడా పెరిగాయి. రాత్రి సమయంలో 20 నుంచి 21 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత నమోదవుతోంది. ప్రస్తుతం ఉష్ణోగ్రతలను బట్టి చూస్తే ఈసారి ఎండలు మండిపయో అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. సంచలన నిర్ణయాల రేవంత్ సర్కార్. 18ఏళ్ళు పైబడిన వారందరికీ డిజిటల్ హెల్త్ కార్డులు!! ఫిబ్రవరిలోనే ఎండలు ఇంతగా ఉంటే మార్చి, ఏప్రిల్, మేలో హైదరాబాద్ వాసులకు చుక్కలు చూసే అవకాశం ఉంది. ఈసారి ఎండకాలంలోనే లోక్ సభ ఎన్నికలతో పాటు, ఏపీ అసెంబ్లీ ఎన్నికలు కూడా నిర్వహించనున్నారు. దీంతో ఎండల్లో ఎలా తిరగాలని నేతలు భయపడుతున్నారు. ఇప్పుడే మూలకున్న కూలర్లను తీసి దుమ్ము దులిపి వాడడం మొదలు పెట్టారు. చలి తగ్గడంతో రాత్రి వేళ్లల్లో ఫ్యాన్ల వినియోగం కూడా భారీగా



పెరిగినట్లు తెలుస్తోంది. ఇక ఏసీల వాడకం కూడా పెరిగింది. దీంతో కూలర్లు, ఏసీలకు గిరాకి ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. మరోవైపు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో విద్యుత్ వినియోగం క్రమంగా పెరుగుతోంది. మధ్యాహ్నం 3,100 మెగావాట్ల డిమాండ్ ఉండగా.. రాత్రి 2,697 మెగవాట్లుగా ఉంది. గతేడాదితో పోలిస్తే ఇది ఎక్కవే. దీంతో అధికారులు విద్యుత్ కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

## రూ.500కే గ్యాస్ సిలిండర్.. మార్గదర్శకాలు సిద్ధం!






హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎన్నికల వేళ ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలు కోసం తీవ్రంగా కృషి చేస్తోంది. ఇప్పటికే రెండు హామీలను అమల్లోకి తెచ్చింది. అంతేకాక అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోగా.. ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారు. ఇక ఆరు గ్యారెంటీలకు లబ్దిదారులను ఎంపిక చేయడం కేయడం కోసం ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులు స్వీకరించింది ప్రభుత్వం. ప్రస్తుతం మిగతా గ్యారెంటీల అమలుకు మార్గదర్శకాలు రెడీ చేసే పనిలో ఉంది. దీనిలో భాగంగా రూ. 500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఫ్రీ కరెంట్ పథకాల అమలుకై తాజాగా నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా రూ. 500కు వంటగ్యాస్ సిలిండర్ అందజేత పథకానికి దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఆ వివరాలు.. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకం అర్హులును ఎంపిక చేయడం కోసం.. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తల ద్వారా పరిశీలించనున్నారు. ఆ తర్వాత అర్హుల వివరాలను ప్రత్యేక మొబైల్ యాప్‌లో నమోదు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి కార్యకర్త 30 దరఖాస్తులను తీసుకువెళ్లి.. వారి రేషన్‌కార్డు, ఎల్‌పీజీ కంపెనీ పేరు, వినియోగదారు నంబర్, పాస్‌బుక్ నెంబర్, డెలివరీ రసీదు నంబరు వంటి వివరాలను పరిశీలిస్తారు. ఆ తర్వాత వారు 500లకే గ్యాస్ సిలిండర్ పొందేందుకు అర్హులని భావిస్తే.. వారికి సంబంధించి తెల్ల రేషన్‌కార్డు, ఎల్‌పీజీ కంపెనీ పేరు, వినియోగదారు సంఖ్య వంటి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు గ్రామాలకు సంబంధించి పూర్తి స్థాయిలో అవగాహన ఉండటంతో అర్హుల ఎంపిక ప్రక్రియను వారికి

## ఎంపిక విధానం ఇదే.. వారు 'ఓకే' అంటేనే అర్హులు..!

అప్పగించింది సర్కార్. వారు ఓకే అన్న వారే ఈ పథకానికి అర్హులుగా ఎంపిక కానున్నారు. రూ. 500లకే గ్యాస్ సిలిండర్ పథకానికి అర్హులయ్యే వారి వివరాల నమోదు కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను నేడు అన్ని జిల్లాలకు పంపించనున్నారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయిలో ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, జిల్లాస్థాయిలో కలెక్టర్లు ఈ యాప్ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తారు. రాష్ట్రస్థాయిలో రెవెన్యూ కార్యదర్శి, పౌరసరఫరాలు, జీహెచ్‌ఎంసీ కమిషనర్లు, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ జనరల్ పరిశీలిస్తారు. పరిశీలన తర్వాత అర్హులను ఎంపిక చేసి.. వారికి మాత్రమే రూ. 500కే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేయనున్నారు. అంతేకాక ఇటీవల తెలంగాణ కేబినెట్ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించేందుకు తీసుకువచ్చిన గృహజ్యోతి పథకానికి కూడా ఆమోదం తెలిపింది. అంతేకాక ఈ ఉచిత విద్యుత్ ను అద్దెకు ఉండే వారికి కూడా ఇవ్వనున్నట్లు దక్షిణ తెలంగాణ డిస్కం వెల్లడించింది.

# సంపాదకీయం

## ఒక కుక్క-రెండు బిస్కట్లు రాహుల్ వర్సెస్ బీజేపీ!

హెడ్డింగ్ చూస్తే.. ఆశ్చర్యం అనిపిస్తుంది. కానీ, నిజమే. కుక్కపిల్ల.. సబ్బుబిళ్ల.. కాదేదీ కవితకనర్హం అని శ్రీశ్రీ అన్నట్టుగానే.. బీజేపీకి కూడా రాజకీయం చేసేందుకు కుక్కపిల్లలను కూడా వినియోగించేసుకుంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఏదో ఒక విధంగా డ్యామేజీ చేయాలనే సంకల్పంతో ఉన్న బీజేపీనేతలు.. ఆయన చేస్తున్న భారత్ జోడా న్యాయ యాత్రపై కాంగ్రెస్ నేతల కన్నా కూడా.. ఎక్కువగానే దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే బీజేపీ నేతలకు కుక్క కనిపించింది. దీనిని అడ్డ పెట్టుకునిరాహుల్‌పై విమర్శలు చేసింది. దీనికి రాహుల్ కూడా గట్టిగానే జవాబు చెప్పారనుకోండి. ప్రస్తుతం రాహుల్ పాదయాత్ర.. జారండ్‌లో సాగుతోంది. ఈ సమయంలో పార్టీ అభిమాని ఒకరు.. ఈ యాత్రలో పాల్గొన్నారు. అయితే.. ఆయన తన వెంట తన కుక్కపిల్లను కూడా తీసుకువచ్చారు. ఇది బొద్దుగా ముచ్చటగా ఉండడంతో రాహుల్ కన్ను ఈ కుక్కపై పడింది. వెంటనే దానినిదగ్గరకు తీసుకున్నారు. అదేసమయంలో తన వారితో చెప్పి.. దానికి బిస్కట్లు తీసుకురావాలని ఆదేశించారు. దీంతో వారు కుక్కలకు ప్రత్యేకంగా ఉండే బిస్కట్లను తీసుకువచ్చి ఇచ్చారు. వీటిలో రెండు బిస్కట్లను రాహుల్.. తన చేత్తో తీసి..కుక్కకు తినపించబోయారు. అయితే.. ఆ కుక్క బెదిరిపోయిందో ఏమో.. బిస్కట్లు వాసన చూసి వదిలేసింది. దీంతో రాహుల్.. వెంటనే కుక్క యజమాని, పార్టీ కార్యకర్తకు.. అవే బిస్కట్లు చేతికి అందించి.. "నువ్వు తినిపించు" అని అన్నారు. దీంతో సదరు కార్యకర్త.. తన కుక్కకు ఆ రెండు బిస్కట్లు తినిపించారు. ఆ కుక్క చొంగకార్చుకుంటూ.. ఆ బిస్కట్లు ఆబగా తినేసింది. ఇదే.. బీజేపీ కార్నర్ చేసింది. ఒక వీడియోను పోస్ట్ చేసింది. రాహుల్ తన మద్దతుదారులను కుక్కల్లా చూస్తున్నారంటూ ఆక్షేపించింది.(కుక్క తినిపించాలని రెండు బిస్కట్లు కార్యకర్తకు ఇవ్వడాన్ని) అయితే.. ఇది భారీ ఎత్తున వైరల్ కావడంతో రాహుల్ గాంధీ దీనిపై స్పందించారు. కార్యకర్తకు బిస్కట్ ఇవ్వలేదు, ఆయన కాంగ్రెస్ కార్యకర్త అని తెలియదు. కుక్కల పట్ల బీజేపీకి ఉన్న ప్రేమ ఏపాటిదో నాకు అర్థం కావడం లేదు. కుక్కలు వాళ్లకు ఏమి హాని చేశాయి. పప్పీకి బిస్కెట్లు తినిపిద్దామనుకుంటే అది కొంత నెర్వస్‌గా, భయంగా కనిపించింది. దాంతో పప్పీ యజమానికే ఆ బిస్కెట్లు ఇచ్చా. అతను తినిపించగానే పప్పీ ఆప్యాయంగా వాటిని తింది. ఇందులో సమస్య ఏముంది అని రాహుల్ ప్రశ్నించారు.

## మహిళా శిశు సంక్షేమ శాఖ కృషితో 11 ఏళ్ల తర్వాత తిరిగి తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలుడు...




శామీర్ పేట, (గరుడ వార్త) : మహిళా శిశు సంక్షేమ శాఖ కృషితో 11 ఏళ్ల క్రితం తప్పిపోయిన బాలుడు తిరిగి తన తల్లిదండ్రుల చెంతకు చేరాడు. వివరాల్లోకి వెళితే 2013లో ఉప్పల్ పరిధిలోని చిల్కానగర్ ప్రాంతానికి చెందిన నారాయణ శర్మ కుమారుడు రోహిత్ శర్మ తప్పిపోయాడు. ఆ సమయంలో ఉప్పల్ పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ బాలుడు ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ లోని అదృత్ చిల్డ్రన్ హోమ్ లో ఉన్నాడు. ఈ బాలుడి చిరునామా కోసం వివిధ మార్గాలలో అదృత్ చిల్డ్రన్ హోమ్ వారు ప్రయత్నించగా 11 ఏళ్లకు ఆచూకీ లభించింది. గత సంవత్సరం డిసెంబర్ 29న ఈ బాలుని అదృత్ చిల్డ్రన్ హోమ్ వారు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలల సంక్షేమ సమితి వారికి సమాచారం ఇచ్చారు. ఈ బాలల సమితి వారు ఉప్పల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా సిడిఆర్ ద్వారా బాలుడి తల్లిదండ్రులచూకి తెలుసుకున్నారు. ఈ బాలుడిని భువనేశ్వర్ నుండి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి బదిలీ చేశారు. బుధవారం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ రాజారెడ్డి ఆధ్వర్యంలో బాల రక్ష భవన్ అల్వాల్ లో తప్పిపోయిన రోహిత్ శర్మను అతని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు అర్చన, నాగ జయ శీల, నాగ జయశ్రీ, రామ్మోహన్, బాల రక్షక్ భవన్ కోఆర్డినేటర్ నాగమణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఇంతియాజ్ రహీం, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## సైబరాబాద్ లో మెగా హెల్త్ చెకప్ క్యాంప్

**- మెడికవర్, హైదరాబాద్ ఆసుపత్రి వైద్య బృందం సేవలను అభినందించిన సైబరాబాద్ సీపీ**








సైబరాబాద్ క్రైమ్ (గరుడ వార్త) : సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లో సిబ్బందికి హెల్త్ చెకప్ నిర్వహించిన సంబంధిత వైద్య బృందాన్ని సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి అభినందించారు. సైబరాబాద్ లోని అన్ని పోలీస్ స్టేషన్స్ (లా& ఆర్డర్, ట్రాఫిక్), వింగ్స్ మరియు ఇతర డెపార్ట్మెంట్స్ లో పని చేస్తున్న 1063 హోంగార్డ్ ఆఫీసర్లకు/HGOs కు సంబంధించిన 23.01.2024 నుంచి 07.02.2024 వరకు మెడికవర్ ఆసుపత్రి వారి సౌజన్యంతో మెగా హెల్త్ చెకప్ మెడికల్ క్యాంపును సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ లోని సి టి సి లో నిర్వహించారు. ఈ క్యాంపు ఏర్పాటు చేసిన మెడికవర్ ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ డా. దుర్గేష్ శివ, మెడికవర్ ఆసుపత్రి సిబ్బందిని, సిటిసి డాక్టర్లు సరిత, సుకుమార్, తదితరులను సిపి అవినాష్ మహంతి, ఐపీఎస్., అభినందించారు. ఈ సందర్భంగా 1022 హోంగార్డు సిబ్బందికి CBP, FBS, HBA1C,LFT, Lipid Profile, Creatine, ECG and 2D Echo టెస్టులు నిర్వహించి కార్డియాలజీ, జనరల్ ఫిజిషియన్, ఆర్థోపెడిక్స్ డాక్టర్ లతో కన్సల్టెషన్ కూడా నిర్వహించారు. సైబరాబాద్ డీసీపీ క్రైమ్స్ నర్సింహా కొత్తపల్లి మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకుని తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. సీపీతో పాటు డీసీపీ క్రైమ్స్ నర్సింహా కొత్తపల్లి, అడిషనల్ డీసీపీ రవి చందన్ రెడ్డి, ఏసిచపి హోమ్ గార్డ్స్ కృష్ణ, మెడికవర్ ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ డా. దుర్గేష్ శివ, సైబరాబాద్ సిటిసి డాక్టర్లు సరిత, సుకుమార్, మరియు మెడికవర్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా రమాబాయి అంబేడ్కర్ జయంతి వేడుకలు



గుడిహత్నూర్ : మాత రమాబాయి 126 వ జయంతి వేడుకలను మండల కేంద్రంలోని దమ్మచక్ర ప్రవర్తన బుద్ధవిహార్ లో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మరియు భీమ్ టైగర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి మస్కే మాధవ్ మాట్లాడుతూ మాత రమాబాయి అంబేద్కర్ చేసిన త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. పేద పిసికి పిడకలు కొట్టి తన భర్త డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చదువుల కోసం డబ్బులు పంపించిందన్నారు.అంబేద్కర్ అంత పెద్ద చదువులు చదవడానికి ముఖ్య కారణం మాత రమాబాయి అంబేద్కర్ అని అన్నారు. కటిక పేదరికం అనుభవిస్తూనే తన కడుపులో పిల్లల్ని పోగొట్టుకున్న తన జాతి బిడ్డల ప్రయోజనం కోసం సర్వం త్యాగం చేసిందని అన్నారు. అంబేద్కర్ ఈ సమాజంలో ఉన్న అంటరానితనం కుల వివక్షత సమసమాజ నిర్మాణ పోరాటంలో ఏనాడు అడ్డు తగలకుండా తన భర్తకు ఎంతో ప్రోత్సహంగా ఉండి జాతి ప్రయోజనాల కోసం తన బిడ్డలను త్యాగం చేసిన త్యాగధనురాలు మాత రమాబాయి అంబేద్కర్ అని తెలిపారు. ప్రతి ఒక్క మహిళ ఆమె అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాధవ్ ససానే, గోవింద్ బుద్ధే, కుశాల్ గజ్ భారే, కిషన్ బుద్ధే, శంకర్, రమా మాత మహిళ మండల సభ్యులు పాల్గొన్నారు.

## నీటి వనరులపై నిర్లక్ష్యం

వీర్నపల్లి: వీర్నపల్లి మండలం జంపన్న చెరువును మొదటి విడత మిషన్ కాకతీయలో పునరుద్ధరించారు. లీకేజీలు ఏర్పడకుండా బంకమట్టితో మరమ్మతులు చేపట్టారు. అప్పటి వరకు లీకేజీ ఏర్పడని చెరువు మరమ్మతుల తర్వాత కరకట్ట ద్వారా నీరు బయటకు పోతోంది. క్రీడా మైదానంలోకి నీరు చేరి క్రీడాకారులకు ఇబ్బందిగా మారింది. దీంతో స్థానికులు జేసీబీతో కందకం తవ్వించి నీటిని వాగులోకి వెళ్లేలా చర్యలు చేపట్టారు. గర్జనపల్లి పాత, కొత్త చెరువుల పరిస్థితి ఇలాగే ఉంది. ముస్తాబాద్ పెద్ద చెరువుకు రెండు తూములు ఉన్నాయి. వాటి ద్వారా నీరు లీకేజీ అవుతుంది. తూములతోపాటు మత్తడి వద్ద మరమ్మతులు చేయాల్సి ఉంది. పెద్దచెరువు కింద ముస్తాబాద్‌తోపాటు పోత్గల్ గ్రామాలకు కలిపి 415 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించినా నిధులు విడుదల కాలేదు. మళ్లీ పంపిస్తామని జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు. మండలంలో చాలా గ్రామాల్లోని చెరువుల తూములకు మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నా పట్టించుకోలేదు. దీంతో నీరు వృథాగా పోతోంది.కోనరావుపేట: మండలంలో నిజామాబాద్ గద్దెగుట్ట చెరువు డిస్ట్రిబ్యూటరీ మరమ్మతుకు గురైంది. ఈ చెరువు కింద 250 ఎకరాల ఆయకట్టు ఉంది. ఏటా వర్షాకాలంలో కోనరావుపేట, నిజామాబాద్ శివారులోని ఒర్రెలు, అటవీ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున వరద రావటంతో నీటితో కళకళలాడుతోంది. గత వర్షాకాలంలో చెరువు కట్ట డిస్ట్రిబ్యూటరీ వద్ద బుంగ పడి ప్రమాదకరంగా మారింది. రైతులు ఇసుక బస్తాలు వేసి పూడ్చారు. నేటికీ అధికారులు మరమ్మతులు చేపట్టలేదు. తూం వద్ద చెరువు కట్ట కోతకు గురై తెగిపోయే ప్రమాదం నెలకొందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాగునీటి వనరుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. చెరువులు, కుంటలకు మరమ్మతులు కరవై ఏళ్లుగా నిరాదరణకు గురవుతున్నాయి. వర్షాకాలంలో జలకళను సంతరించుకున్నప్పటికీ లీకేజీల వల్ల నీరు వృథాగా పోతోంది. ఫలితంగా తొందరగా చెరువులు, కుంటలు ఖాళీ అవుతున్నాయి. దీంతో అన్నదాతలకు సాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాలో సాగు నీటి అవసరాలకు గొలుసుకట్టు చెరువులే ఆధారం. 666 చెరువుల పరిధిలో సుమారు 80 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అలాగే నక్కవాగు, మూలవాగు, ఎగువమానేరు, సింగసముద్రం జలశయాలు ఉన్నాయి. చిన్నపాటి చెరువులు వర్షపు నీటి వరదతో ఎక్కువగా నిండుతుంటాయి. మండలాల్లోని చాలా చెరువుల కరకట్టలు బలహీనపడ్డాయి. చాలా సంవత్సరాల క్రితం నిర్మించిన మత్తడులు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో లీకేజీ వల్ల నీరు వృథాగా పోతుంది. దీంతో అన్నదాతలు సాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదు.

వీర్నపల్లి మండల కేంద్రంలోని వెంకట్రాయిని చెరువు మరమ్మతుల కోసం రెండు విడతల్లో రూ. 90 లక్షల వరకు ఖర్చు చేశారు. కొత్త మత్తడి ప్రాంతంలో తూమును పునర్నిర్మించారు. కానీ పురాతన మత్తడికి మరమ్మతులు చేయలేదు. దీంతో శిథిలావస్థకు చేరుకున్న వెంకట్రాయిని చెరువు మత్తడి ద్వారా నీరు లీకేజీ అవుతుంది. ఫలితంగా నీటి నిల్వపై ప్రభావం పడుతుంది.

ఎల్లారెడ్డిపేట: మండలంలో వంద ఎకరాలకు పైగా ఆయకట్టు కలిగిన చెరువులు 16, వంద ఎకరాలలోపు ఆయకట్టు ఉన్న చెరువులు మరో 34 వరకు ఉన్నాయి. అనేక చెరువుల తూములు, మత్తడులు ధ్వంసమయ్యాయి. రివిట్‌మెంట్ తొలగిపోయి, చెరువు కట్టలు బలహీనంగా తయారయ్యాయి. తూముల షట్టర్లు శిథిలమవడంతో నీరు వృథాగా పోతోంది. చెరువులకు బుంగలు పడుతుండటంతో రైతులే శ్రమదానంతో పూడ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గడిచిన రెండేళ్ల కాలంలో మండలంలోని మూడు చెరువులకు మాత్రమే తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

దుమాల పెద్ద చెరువుకు శాశ్వతంగా మత్తడి, గేట్‌వాల్ నిర్మాణం కోసం రూ. 77.60 లక్షలతో పంపిన ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. రూ. 22.50 లక్షల నార్మల్ స్టేట్ ప్లాన్ నిధులతో మత్తడికి తాత్కాలిక మరమ్మతులు నిర్వహించి చేతులు దులుపుకున్నారు.

అల్మాస్‌పూర్ ఈదుల చెరువు మత్తడికి రూ. 25 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేశారు. రాచర్ల గొల్లపల్లి సంగెం చెరువు మత్తడి మరమ్మతులకు రూ. 25 లక్షలు వెచ్చించారు. చాలా గ్రామాల్లోని చెరువుల కట్టలు, తూములు, రివిట్‌మెంట్‌లు ధ్వంసమైనా బాగు చేయడం లేదు.

నిధులు మంజూరు కాగానే పనులు

మా దృష్టికి వచ్చిన చెరువుల మరమ్మతుల కోసం ప్రతిపాదనలు ఎప్పటికప్పుడు పంపిస్తున్నాం. జిల్లాలో అక్కడక్కడ చెరువులు ధ్వంసమైనట్లు మా దృష్టిలో ఉంది. నిధులు మంజూరు కాగానే మరమ్మతులకు కృషి చేస్తాం. మార్గదర్శకాల ప్రకారం టెండర్లు పిలిచి పనులు చేయిస్తాం.అమరేందర్, కార్యనిర్వాహక ఇంజినీరు, జలవనరులశాఖ

## జలం.. హరితఫలం

వీర్నపల్లి: భూతాపం తగ్గాలన్నా, వర్షాలు సమృద్ధిగా కురవాలన్నా, స్వచ్ఛమైన ప్రాణవాయువు అందాలన్నా.. పర్యావరణంలో సమతుల్యత ఉండాలన్నా ప్రస్తుత పరిస్థితులలో మొక్కలు నాటాల్సిన అవసరం ఉంది. ఈ అంశాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలుగా తెలంగాణకు హరితహారంతో పాటు అడవుల్లో విరివిగా మొక్కలు నాటడం, అడవుల్లో వన్యప్రాణి రక్షణ, పలు అభివృద్ధి కార్యక్రమాలను అటవీశాఖ ఆధ్వర్యంలో చేపడుతుండటం సత్ఫలితానిస్తోంది. అడవుల అభివృద్ధితో పాటు భూగర్భ జలాల పెంపునకు అటవీశాఖ ప్రత్యేక జలసంరక్షణ పనులను కొన్నేళ్లుగా ప్రభుత్వం చేపడుతుంది. జిల్లాలో ఐదు రేంజ్‌లను ఏర్పాటు చేసి అందులో కుంటలు, చెరువులు, మినీ పర్కోలేషన్ ట్యాంకులు చేపట్టడంతో చిన్నపాటి వర్షాలకే జలకళ సంతరించుకుంటుంది. పలు ప్రాంతాల్లో ఉపాధిహామీ కూలీలతో కాంటూరు కందకాలను తవ్విస్తుండటంతో నీరు సమృద్ధిగా నిలిచి అడవుల్లో భూగర్భ జలమట్టం పెరుగుతుంది. కాంటూరు కందకాలపై కలబంద, నిమ్మగడ్డితో పాటు ఔషధ మొక్కలను పెంచుతున్నారు. అడవుల్లో కలప అక్రమ రవాణా నిరోధించడానికి దాదాపు 70 కి.మీ. మేర మీటర్ వెడల్పుతో కందకాలను తవ్వించారు. జంతువులు అడవి నుంచి బయటకు రాకుండా ఉండటంతో పాటు పశువులు అడవుల్లోకి రాకుండా ఉండేందుకు పలుచోట్ల ముళ్లు కలిగిన 55 వేల మొక్కలను సరిహద్దు ప్రాంతాల్లో నాటారు. 219 అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులు ఎక్కువగా సంచరిస్తున్నట్లు గుర్తించారు. ఇప్పటివరకు 240 సాసర్‌పిట్స్‌ను అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్మించారు. వాటిలో ఎండకాలం నీటిని నింపి పశువులు, పక్షులకు తాగునీటిని అందించడం జరుగుతుంది. జిల్లాలో ఇప్పటివరకు 45 చెక్‌డ్యాంలు, 113 వరకు నీటి కుంటలు, 2 సోలార్‌బావులను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కొత్తగా 938 ఎకరాల్లో వివిధ రకాల ప్లాంటేషన్లు నిర్మిస్తున్నారు. కొండగట్టు పుణ్యక్షేత్రంలో 200 ఎకరాల్లో ప్రత్యేక ప్లాంటేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాల్లో 10 చోట్ల దశాబ్ది సంపద వనాలు గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో కొత్తగా పల్లెల్లో ఉపాధిహామీ ద్వారా చేపడతున్నారు. ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులతో వృథా నీటికి అడ్డుకట్ట వేయడంతో పాటు అడవుల అభివృద్ధి, వన్యప్రాణుల దాహార్తికి ఎంతగానో ఉపయోగపడనుంది. ఈ ఏడాది అన్ని ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో 24 లక్షల మొక్కల పెంపకం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

వన సంపదకు దోహదం

జిల్లాలో క్షీణించిన అడవుల పునరాభివృద్ధికి ప్రత్యేక సంరక్షణ కార్యక్రమాలు చేపడుతున్నాం. జలసంరక్షణ చర్యలు సత్ఫలితాలు ఇవ్వడంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నాం. ఇప్పటివరకు నిర్మించిన చెరువులు, కుంటలు, కాంటూర్ కందకాలతో వర్షపు నీరు నిలిచి భూగర్భ జలమట్టం పెరుగుతుంది. దీంతో వన్యప్రాణుల దాహార్తి తీరడమే కాకుండా వనసంపద పెరిగేందుకు ఎంతగానో దోహదపడుతుంది.

## ఇంటిదొంగలెవరు.. ఇచ్చిపుచ్చుకునే వారెవరు..?

ఖమ్మం : గంజాయి రవాణాపై ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పోలీసు, ఆబ్కారీ శాఖల యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోంది. గంజాయి మూలాలను శోధించేందుకు నిఘా బృందాలు రంగంలోకి దిగాయి.

శాఖల మధ్య సమన్వయం

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల మీదుగా గంజాయి విచ్చలవిడిగా సరఫరా అవుతోంది. రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త సర్కారు గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించింది. పాత్రధారులు, సూత్రధారుల మూలాలు కనుగొని కట్టడి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పోలీసు బాసులకు దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పోలీసు, ఆబ్కారీ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. ఇటీవల పది రోజుల పాటు ప్రత్యేక తనిఖీలు చేపట్టాయి. గంజాయి అడ్డాలు, విక్రయ కేంద్రాలపై దాడులు జరిపాయి.

పాత్రధారులు, సూత్రధారుల భరతం పట్టేలా..

వ్యాపారులు ఒడిశా, ఏపీలోని వివిధ ప్రాంతాల్లో తక్కువ ధరకు గంజాయిని కొని ఇతర చోట్ల ఎక్కువ ధరకు విక్రయిస్తుంటారు. ఈ దందాలో మైనర్లను వినియోగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇటీవల చాక్లెట్ రూపంలో గంజాయి సిగరెట్లు పట్టుబడటంతో ఉభయ జిల్లాల్లో వీటి వినియోగం, సరఫరాదారుల కదలికలపై కన్నేశారు. ఆయా కేసుల్లో అరెస్ట్ అయిన నిందితుల నుంచి సేకరించిన సమాచారం మేరకు పాత్రధారులు, సూత్రధారుల నిగ్గు తేల్చేందుకు వ్యూహం రచిస్తున్నారు.



ఒడిశా, ఆంధ్రప్రదేశ్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సూత్రధారుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. సూత్రధారులు దొరికితే గంజాయి రవాణాకు అడ్డుకట్ట పడుతుందని భావిస్తున్నారు.

యంత్రాంగం ప్రమేయంపై దృష్టి

అత్యాశతో పోలీసు, ఆబ్కారీ శాఖల్లోని కొందరు సిబ్బంది గంజాయి సరఫరాదారులు, వ్యాపారులతో చేతులు కలుపుతున్నారు. అందుకే క్వింటాళ్ల కొద్దీ సరకు సరిహద్దులు దాటుతుందనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. భద్రాచలంలో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ ఇటీవల గంజాయి రవాణా కేసులో పట్టుబడటం కలకలం రేపింది. గతేడాది ఇద్దరు కానిస్టేబుళ్లు సైతం ఇలాగే పట్టుబడ్డారు. ప్రతినెలా మామూళ్లు తీసుకుని అక్రమ దందాను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ కొందరు పోలీసు అధికారులపై ఆరోపణలు గుప్పుమంటున్నాయి. గంజాయి రవాణాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా కొంతమంది సిబ్బంది, అధికారుల ప్రమేయం ఉండటాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఇలాంటి వారి కదలికలపైనా నిఘా పెంచారు.

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా

గంజాయి రవాణాపై జనవరి నుంచి ప్రత్యేక నిఘా పెట్టాం. ప్రత్యేక బృందాలతో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నాం. పాత్రధారులు, సూత్రధారుల మూలాలు కనుగొనేలా ముందుకు సాగుతున్నాం. జిల్లాలో గంజాయి వినియోగాన్ని నిర్మూలించటమే కాకుండా సరకు రవాణా జరగకుండా చూస్తాం. సునీల్‌దత్, సీపీ

## సరకు రవాణా.. నిండుతున్న ఖజానా!

ఖమ్మం : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) సరకు రవాణా (కార్గో) సేవలు సత్ఫలితాలనిస్తున్నాయి. వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించటంతో సరకు రవాణా ద్వారా సంస్థకు గణనీయమైన ఆదాయం సమకూరుతోంది.

సేవలను విస్తరించే క్రమంలో సంస్థ ప్రైవేటు ఏజెన్సీలను ప్రోత్సహిస్తోంది. టీఎస్ఆర్టీసీ ఖమ్మం రీజియన్ పరిధిలో 46 కౌంటర్లను నిర్వహిస్తోంది. ఆంధ్రప్రదేశ్, బెంగళూరు ప్రాంతాలకు సేవలను విస్తరించింది. నగదు రహిత చెల్లింపులతో పాటు బార్‌కోడ్ స్కానింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. లాజిస్టిక్ బుకింగ్, షిప్‌మెంట్, డెలివరీ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు మరింత సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలని సంస్థ నిర్ణయించింది. ఇప్పటివరకు పార్సిళ్లు, కవర్లు, పచ్చి సరకు వంటివి తీసుకొని గమ్యస్థానాలకు చేరుస్తోంది.

సేవల్లో పారదర్శకత పెరిగేలా..

కార్గో సేవలకు వినియోగదారుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. అయితే పార్సిళ్లను గమ్యస్థానానికి చేరవేసే క్రమంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించాల్సి ఉంది. పార్సిళ్లు బుకింగ్ చేసిన ప్రాంతాలకు కాకుండా వేరేచోటుకు వెళ్తుండటంతో గందరగోళం ఏర్పడుతోంది. ఆయా సమయాల్లో కార్గో కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందిలో జవాబుదారీతనం లోపిస్తున్నట్లు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. వస్తు, సామగ్రి భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆ విభాగం అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ముఖ్యంగా ప్రైవేటు ఏజెన్సీ కేంద్రాల ద్వారా బుకింగ్ చేస్తున్న పార్సిళ్లకు భరోసా లేకుండా పోతోంది. తెలుగు రాష్ట్రాల్లో ఒకే రకమైన పేర్లు ఉన్న ప్రాంతాలకు సంబంధించిన విషయంలో ఈ తరహా సమస్యలు ఎదురవుతున్నాయి. వస్తు రవాణా సెంటర్ల వద్ద బుకింగ్ వివరాలను సిబ్బంది సక్రమంగా పరిశీలించకపోవటంతో ఒకచోటుకు చేరాల్సినవి మరో ప్రాంతానికి వెళ్తున్నాయి. తమ వస్తువులు ఏమయ్యాయోనని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. ఇలాంటి సమస్యలను అధిగమిస్తూ సులభతరమైన సేవలందించేందుకు సాంకేతికతను మరింత పటిష్ఠం చేస్తున్నామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ప్రైవేటు ఏజెన్సీలను సైతం విస్తరించి పకడ్బందీ సేవలందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అక్కడే కొరియర్ సర్వీసులు..ఖమ్మం రీజియన్ పరిధిలోని కార్గో సెంటర్లలో కొరియర్ సేవలు అందుబాటులోకి వచ్చాయి నేరుగా ఇంటికి చేరవేసే సదుపాయం లేదని, కార్గో సెంటర్ల వద్దకు వచ్చి సంబంధిత వ్యక్తులు తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

# సీఎంపీఎఫ్‌లో ఆన్‌లైన్ సేవలు




గోదావరిఖని: బొగ్గుగని కార్మికుల భవిష్యనిధి (సీఎంపీఎఫ్) సేవలు ఇక ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానున్నాయి. పూర్తిస్థాయిలో పారదర్శక సేవలు అందించనుంది. దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు సంబంధించిన సీఎంపీఎఫ్ నిధులు, పింఛన్లకు సంబంధించిన సేవల్లో ఎక్కడా జాప్యం లేకుండా అందుబాటులోకి తీసుకొచ్చారు. కేంద్ర బొగ్గుశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషీ దిల్లీలో సి-డాక్ పోర్టల్‌ను ఇటీవల ప్రారంభించారు. సీఎంపీఎఫ్ అధికారుల సమక్షంలో ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇప్పటి వరకు రికార్డుల ప్రకారం కార్మికులకు సేవలందించే వారు. కార్మికుడు తన ఖాతాల్లో ఎంత నిల్వ ఉందన్న విషయాన్ని ప్రస్తుత సేవలతో ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంది. పింఛనుదారులు సైతం లోపాలుంటే వెంటనే అందులో గుర్తించి సవరించుకునే వీలుంటుంది. సింగరేణితో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ఎనిమిది బొగ్గు పరిశ్రమల్లో పనిచేసే 3.5 లక్షల మంది ఉద్యోగులతో పాటు 6 లక్షల మంది విశ్రాంత కార్మికుల పింఛన్లకు సంబంధించి సేవలను ప్రస్తుతం ఆన్‌లైన్‌లో అందించేందుకు పోర్టల్‌ను రూపొందించారు. నేరుగా తమ ఖాతా నంబరు ద్వారా సెల్‌ఫోన్‌లోనే సమాచారం తెలుసుకునే విధంగా పోర్టల్‌ను రూపొందించారు.

పారదర్శకం.. అవినీతి రహితం

ఆన్‌లైన్ విధానంతో పారదర్శక సేవలు అందనున్నాయి. రుణాల మంజూరుకు కొంత మంది దళారులు కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేసేవారు. సకాలంలో రుణం రావాలంటే కార్మికులు తప్పనిసరి పరిస్థితుల్లో దళారులకు డబ్బులు ఇచ్చి పనులు చేయించుకునే వారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న కార్మికులకు ప్రక్రియ సకాలంలో సాగాలంటే తప్పనిసరి పరిస్థితుల్లో లంచాలు ఇచ్చే పరిస్థితి ఉండేది. కార్మికులు తమ సొంత అవసరాలు ఇంటి నిర్మాణానికి, పిల్లల పెళ్లిళ్లకు రుణాలు పొందాలంటే దళారులను ఆశ్రయిస్తేనే పనులు జరిగే అవకాశం ఉండేది. ప్రస్తుతం ఆ అవకాశం లేకుండా ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

వేగంగా పనులు

కొత్తగా ప్రారంభించిన పోర్టల్‌తో పనులు వేగం కానున్నాయి. ఎక్కడా పెండింగ్ లేకుండా సేవలను వేగంగా అందించే అవకాశం ఉంది. కార్మికులు తమ అవసరం కోసం సీఎంపీఎఫ్ రుణాలకు దరఖాస్తు చేసుకున్నా.. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత సీఎంపీఎఫ్ చెల్లింపులకు సంబంధించిన అంశాలపై త్వరితగతిన పనులు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న రికార్డు విధానంతో రుణాల కోసం కార్మికులు నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం సి-డాక్ పోర్టల్‌తో అందే ఆన్‌లైన్ సేవలతో ఇలాంటి ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

నిధుల మళ్లింపుపై నిఘా

గతంలో సీఎంపీఎఫ్ నిధులను ఫైనాన్స్ కంపెనీకి మళ్లించడం వల్ల ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వచ్చింది. కార్మికుల నుంచి జమ చేస్తున్న సీఎంపీఎఫ్ నిధి నుంచి కొంత మొత్తం ఆర్థిక సంస్థకు రుణం కింద అప్పగించారు. ఆ సంస్థ దివాళా తీయడంతో సీఎంపీఎఫ్ నిధులు తిరిగి వసూలు చేయలేకపోయారు. దీంతో సీఎంపీఎఫ్ నిధిలో లోటు బడ్జెట్ ఏర్పడింది. దీన్ని బలోపేతం చేసేందుకు ఒక టన్ను బొగ్గు ఉత్పత్తికి యాజమాన్యాల నుంచి రూ.10 జమ చేయాలని నిర్ణయించారు. దీంతో కొంత వరకు నిధి పెరిగినప్పటికీ ఇంకా కొన్ని సమస్యలున్నాయి. భవిష్యత్తులో సీఎంపీఎఫ్ నిధులు మళ్లించేందుకు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా వెంటనే సభ్యులకు తెలిసే అవకాశం ఉంటుంది.

# అడుగులు పరిష్కారం వైపు..!



సూర్యాపేట : పురపాలికల్లో స్థలాల క్రమబద్ధీకరణకు మోక్షం కలగనుంది. నిబంధనలు పాటించకుండా కొనుగోలు చేసిన స్థలాలను క్రమబద్ధీకరిస్తామంటూ మూడేళ్ల క్రితం గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను తీసుకురాగా.. పురపాలికలకు కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చాయి. అక్రమ లేఅవుట్లలో భూములు కొన్న చాలామంది తమకు ఉపశమనం లభిస్తోందని భావించారు. కానీ, ఎలాంటి పరిష్కారం మార్గం దక్కలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు పరిష్కారం చూపుతామని చెప్పడంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ఫోన్ చేసి సమాచారమిస్తూ..

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికల్లో 1,88,837 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 72,520 దరఖాస్తులను క్రమబద్ధీకరించారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో దరఖాస్తుదారుల్లో ఆశలు కలిగాయి. క్రమబద్ధీకరణకు ఏమైనా పత్రాలు తక్కువ ఉంటే పుర అధికారులు సంబంధిత యజమాని చరవాణికి సమాచారం ఇస్తున్నారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది. లే అవుట్ స్థలంలో ఇల్లు, భవనం, నిర్మించుకుంటే దానికి అనుమతి ఇస్తారు. బ్యాంకు రుణం కూడా పొందవచ్చు. నాన్ లేఅవుట్ ప్లాట్‌లో నిర్మిస్తే అన్ని సమస్యలే ఎదురవుతాయి. పురపాలికల్లో పరిశీలన షురూ కావడంతో ఏళ్ల తరబడి వేచి చూస్తున్న వారికి నిరీక్షణ ఫలించనుంది.

రూ.10 వేలు చెల్లించిన వారికి తప్పని నిరీక్షణ

ఉమ్మడి నల్గొండ జిల్లాలో వ్యవసాయ భూములను వెంచర్లు మార్చినవారు అనుమతి కోసం గత ప్రభుత్వ హయాంలో రూ.10 వేలు చెల్లించారు. ప్రభుత్వం మాత్రం మొదట రూ.వెయ్యి చెల్లించిన వారివి మాత్రమే క్రమబద్ధీకరించాలని ఆదేశాలు జారీచేసింది. దీంతో వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసినవారు ప్లాట్ల క్రమబద్ధీకరణ లేని కారణంగా ఇల్లు నిర్మించుకుంటే ఇబ్బందులు తప్పవని నిరీక్షిస్తున్నారు. గత ప్రభుత్వం కూడా వీరికి ఎలాంటి వెసులుబాటు కల్పించలేదు. ఇటీవల ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఈసారైనా అవకాశం దక్కుతుందోనని వీరు భావిస్తున్నారు. 'ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్లాట్ల క్రమబద్ధీకరణ చేపడతామ'ని పురపాలిక అధికారులు పేర్కొంటున్నారు.

# జనవరిలోనే ఎండిపోయె..!

సూర్యాపేట : సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టులో పరిస్థితి రోజురోజుకూ దారుణంగా మారుతోంది. ఎన్నడూ లేని విధంగా చెరువులు జనవరిలోనే ఎండిపోవడం ఆందోళన కల్గిస్తోంది. చెరువులు ఎండిపోవడంతో గ్రామాల్లోని తాగునీటి బావులు, చేతిపంపులు, రక్షిత మంచినీటి బోర్లు సైతం నీరు లేక ఎండుతున్నాయి. నిన్న మొన్నటి వరకు సాగునీటి సమస్య ఇప్పుడు గ్రామాల్లో తాగునీటి సమస్యగా మారుతోంది. వర్షాల్లేక.. నీరు రాక సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టులోని దాదాపు 20 మండలాల్లో భూగర్భజలాలు అంతగా తగ్గవు. వానాకాలంలో వర్షాలు పుష్కలంగా కురుస్తుండటంతోపాటు సాగర్‌కు రెండు సీజన్‌లు(వానాకాలం, యాసంగి) నీరు విడుదల చేయడంతో చెరువులు నిండి బావులు, బోర్లలో నీరు పైనే ఉంటుంది. దాంతో ఇంతకాలం తాగునీటి సమస్య అంతగా తలెత్తలేదు. ఈసారి పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. వానాకాలం సీజన్‌లో అనుకున్నంతగా వానలు కురవలేదు. జలాశయాలు నిండకపోవడంతో సాగర్‌కు సాగునీరు లేదు. అత్యవసర పరిస్థితి నెలకొనడంతో (వానాకాలం పంటలు కాపాడేందుకు) ఒక్కసారి పది రోజులు (అక్టోబరు 7 నుంచి 18 వరకు) నీరు విడుదల చేశారు. చెరువులు నింపకపోయినా కాస్త అక్కడక్కడా జాలు వెళ్లడంతో చెరువుల్లో నీరు కాస్త పెరిగింది. తర్వాత నీరు లేదు.



వర్షాలూ లేవు. పూర్తిగా వేసవిని తలపించే రీతిలో ఎండలు ఉన్నాయి. డిసెంబరు నుంచి ఆయకట్టులోని చెరువులు, బోర్లు, బావుల్లో నీటి నిల్వలు తగ్గుతూ వచ్చాయి. దీనికి తోడు వానాకాలంలో సాగుచేసిన రైతులు యాసంగిలో పంటలను కాపాడుకునేందుకు విపరీతంగా బోర్లు వేశారు. వరిసాగు బాగా పెరిగింది. నీరు తోడటం ఎక్కువగా ఉండటంతో భూగర్భజలాలు పడిపోయి చెరువుల్లో రోజురోజుకూ నీరు తగ్గి జనవరి చివరి నాటికి పరిస్థితి చేయి దాటిపోయింది. ఇప్పుడు వరి పొలాలు ఎండిపోవడంతో పాటు గ్రామాల్లో తాగునీరు లేకుండా పోయింది.

ప్రస్తుతం సాగర్ ఎడమ కాల్వకు నీరు విడుదల చేసి పాలేరు రిజర్వాయర్‌కు తరలిస్తున్నారు. రెండు మూడు రోజులు ఉమ్మడి నల్గొండ జిల్లాలో మేజర్లకు నీరు విడుదల చేయడంతో పాటు చెరువులు నింపితే రెండు విధాలుగా ప్రయోజనం ఉంటుంది.

## పరిశోధన కేంద్రం.. వీడని గ్రహణం

కూసుమంచి : రాష్ట్రంలోని ఏకైక మత్స్య పరిశోధన కేంద్రం కూసుమంచి మండలం పాలేరులో ఉంది. పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలో కొనసాగుతోంది. ఏళ్ల తరబడి సౌకర్యాలకు నోచుకోక అపసోపాలు పడుతోంది. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో సమకూరిన సదుపాయాలు మినహా ఆతర్వాత ఎలాంటి అభివృద్ధి జరగలేదు. శాస్త్రవేత్తలు, సిబ్బంది నియామకాల్లేక పనిభారం అధికమవుతోంది. పరిశోధన కేంద్రానికి అనుబంధంగా ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు పదెకరాల స్థలం కేటాయించినా పురోగతి లేకుండా పోయింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ బలోపేతానికి పూనుకుంది. ఇదే సమయంలో పాలేరు పరిశోధన కేంద్రంపై దృష్టి సారించాల్సిన అవసరముంది.

ప్రతిపాదనలకే పరిమితమైన పాలిటెక్నిక్ కళాశాల

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక వనపర్తి జిల్లా పెబ్బేరులో మత్స్య కళాశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మత్స్య పాలిటెక్నిక్ కళాశాలను పాలేరులో నిర్మించాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది.పరిశోధన కేంద్రానికి కి.మీ. దూరంలో పదెకరాల ఎన్నెస్పీ స్థలాన్ని అధికారులు గుర్తించారు. ఎన్నెస్పీ నుంచి మత్స్యశాఖకు ఆస్థలాన్ని బదిలీ చేశారు. ఏడాది గడచినా రూ.31 కోట్లతో పంపిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. ఇక్కడ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో మత్స్యరంగం ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



మెరుగుపడే అవకాశముంది.

శిక్షణ కేంద్రం, వసతిగృహం లేక..

మత్స్య పరిశోధన కేంద్రంలో పరిశోధనలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారులకు వివిధ అంశాలపై ఐదేళ్లుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ, రాష్ట్ర మత్స్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఇప్పటికే 70 కార్యక్రమాల ద్వారా 3,500 మంది మత్స్యకారులు, ఔత్సాహిక మత్స్య పారిశ్రామికవేత్తలకు శిక్షణనిచ్చారు. తర్ఫీదుకు వచ్చేవారికి చిన్న భవనం మినహా వసతిగృహం, శిక్షణకు సరైన భవనం అందుబాటులో లేవు. రూ.85 లక్షలతో ప్రతిపాదనలు పంపినా మంజూరు కాలేదు.

సరైన ప్రయోగశాల ఏదీ..?

చేపలకు సోకే వ్యాధులపై మత్స్య పరిశోధన కేంద్రంలో పరీక్షలు జరుగుతాయి. పరిశోధనలకు మెరుగైన వసతులు, ఆధునిక, సాంకేతిక పరికరాలు మరిన్ని అవసరం.కేంద్రంలో చేపపిల్లల ఉత్పత్తికి చైనీస్ సిమెంటు హేచరీని అందుబా టులోకి తీసుకురావాలి.ఇక్కడి చేపల చెరువుల్లో ప్రయోగాల నిమిత్తం చేపలు పెంచుతున్నారు. వాటి దాణా తయారీ యూనిట్‌కు రూ.25 లక్షలతో ప్రతిపాదనలు పంపినా మంజూరు కాలేదు. జన్యుపరంగా అభివృద్ధిపరిచిన తిలాపియా చేపపిల్లల ఉత్పత్తికి గిఫ్ట్ హేచరీ ఏర్పాటుకు రూ.40 లక్షలతో పంపిన ప్రతిపాదనలు అమలుకు నోచుకోలేదు.పరిశోధన కేంద్రానికి ప్రహరీ, చేపల చెరువుల మరమ్మతులు, సమీకృత చేపల పెంపకం విధానంలో మరిన్ని ప్రతిపాదనలు కార్యరూపం దాల్చాల్సి ఉంది.

పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తలు ఐదుగురు ఉండాలి. ప్రస్తుతం ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారు. ప్రధాన శాస్త్రవేత్తతో పాటు మరొకరు ఒప్పంద విధానంలో నియమితులయ్యారు.

## పంట విక్రయ వెతలు దూరమయ్యేదెప్పుడో?

ఆదిలాబాద్ : తలమడుగు మండలం సుంకిడిలో కొత్త వ్యవసాయ మార్కెట్‌యార్డు ఏర్పాటు ఊరిస్తూనే ఉంది. తొలుత సబ్ మార్కెట్ యార్డు అనుకున్నా పూర్తిస్థాయి ప్రత్యేక మార్కెట్‌యార్డుకు అడుగులు ముందుకు పడినా అది స్థల సేకరణ వరకే పరిమితమైంది. యార్డు ఎప్పుడు అందుబాటులోకి వస్తుందోనని తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల రైతులు ఎదురుచూస్తున్నారు.

ఆదిలాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్‌యార్డు పరిధిలో ఆదిలాబాద్ గ్రామీణం, ఆదిలాబాద్ అర్బన్, మావల, తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల రైతులు తమ పంట ఉత్పత్తులను తీసుకొస్తున్నారు. పత్తి, సోయా, శనగలు, కందులు, జొన్న అమ్మకాల సమయంలో రైతులంతా పంటను మార్కెట్‌కు తీసుకొచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా భీంపూర్, తలమడుగు మండలాల్లోని పలు గ్రామాల రైతులు 45 కిలోమీటర్లకు పైగా ప్రయాణం చేసి ఆదిలాబాద్‌కు పంట తీసుకొస్తూ అవస్థలు పడుతున్నారు. ఆదిలాబాద్ మార్కెట్ పరిధిలో ఆరు మండలాలకు చెందిన 40 వేల మంది రైతులు ఉన్నారు. సీజన్‌లో మార్కెట్ యార్డుకు భారీగా వాహనాలు వస్తుండటంతో అన్నదాతలు రెండు మూడు రోజులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. మూడు మండలాల రైతుల ప్రయోజనార్థం సుంకిడిలో మార్కెట్‌యార్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఏళ్ల నుంచి ఉంది. తద్వారా 15 కిలోమీటర్లకుపైగా దూరం తగ్గుతుంది. పడిగాపుల ఇబ్బందులు తప్పుతాయి. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకొని తొలుత సుంకిడిలో ఉపమార్కెట్‌యార్డు ఏర్పాటు చేయాలని భావించారు. అదీ సాధ్యం కాలేదు. గత భారాస ప్రభుత్వ హయాంలో అప్పటి బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఈ విషయమై ముఖ్యమంత్రికి నివేదించడంతో ప్రభుత్వం నుంచి యార్డు ఏర్పాటుకు ఆదేశాలు వచ్చాయి. తలమడుగు, తాంసి, భీంపూర్ తదితర మూడు మండలాలు బోథ్ నియోజకవర్గ పరిధిలోకే రావడంతో సుమారు 24 వేల మంది రైతులకు ఉపయోగపడేలా ప్రత్యేక యార్డుకు అడుగులు పడ్డాయి.

అయిదెకరాలు గుర్తింపు కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు సుంకిడి గ్రామంలోని సర్వే నెంబరు 137లో అయిదెకరాల ప్రభుత్వ భూమిని సేకరించారు. ఇదే విషయమై 27.12.2022న తలమడుగు మండల తహసీల్దార్ పేరిట పూర్తి వివరాలతో ఆదిలాబాద్ ఆర్డీఓకు నివేదించారు. ఇది అక్కడి వరకే ఆగిపోయింది. ఆ తరువాత కదలిక లేకపోవడంతో యార్డు ఆశలు సన్నగిల్లాయి.

ప్రాంతాభివృద్ధికి అవకాశం

మార్కెట్ యార్డు ఏర్పాటైతే పత్తి జన్నింగ్ మిల్లులు, ఇతర పరిశ్రమలను నెలకొల్పేందుకు అవకాశం ఉంటుంది. ప్రైవేటు వ్యాపారులకు విక్రయించేది ఉంటే రైతులు మార్కెట్‌లో పత్తిని తూకం వేసి పంటను ఆయా జిన్నింగ్ మిల్లులకు పంపుతారు. సుంకిడి ప్రాంతంలో జిన్నింగ్ మిల్లులు లేకపోవడంతో యార్డు వస్తే అక్కడ పరిశ్రమలు కూడా వచ్చేందుకు వీలుంది. తద్వారా అక్కడ భూముల ధరలు పెరిగి రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

భూమి అప్పగిస్తే ప్రభుత్వానికి నివేదిస్తాం

శ్రీనివాస్, మార్కెట్ సహాయ సంచాలకులుమార్కెట్‌యార్డు ఏర్పాటుకు భూమి సేకరించాలని గతంలో ఆదేశాలు వచ్చిన మాట వాస్తవమే. రెవెన్యూ అధికారులు మార్కెట్‌కు భూమి అప్పగిస్తే ప్రభుత్వానికి నివేదిస్తాం. ఆ తరువాత విభజన మొదలవుతుంది. ప్రత్యేక సిబ్బందిని ప్రభుత్వం కేటాయించి మార్కెట్ కార్యకలాపాలు మొదలు పెడుతుంది.

# క్రీడల్లో భళా.. విద్యార్థుల హవా

సూర్యాపేట : చిన్నారులు ఆటలు ఆడుతుంటే సహజంగానే పెద్దవాళ్లు ఆటలు కాదు చదువుకోండని అంటుంటారు. కానీ చదువుతో పాటు చిన్నారుల మానసికోల్లాసానికి ఆటలు కూడా అవసరమని సంబంధిత నిపుణులు అంటున్నారు. ఆటలు దేహదారుఢ్యంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. వ్యాయామ ఉపాధ్యాయులు ఈ విషయాన్ని వారికి అర్థమయ్యేలా వివరిస్తుండటంతో పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు తమకు ఇష్టమైన క్రీడల్లో సాధన చేస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభను చాటుతున్నారు. తమ భవితకు క్రీడలను ఒక సోపానంగా మలచుకోవాలని భావిస్తున్నారు. చిట్యాల పురపాలికలోని గ్రీన్‌గ్రోవ్ పాఠశాల విద్యార్థులు హాకీ, త్రోబాల్ క్రీడలకు సంబంధించి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని తమ ప్రతిభను చాటుతున్నారు.

రాష్ట్రస్థాయిలో..

త్రోబాల్ పోటీల్లో: బీ 2021-22 సంవత్సరంలో ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌లో జరిగిన త్రోబాల్ జాతీయ స్థాయి పోటీలో పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

2022-23 సంవత్సరంలో హిమాచల్‌ప్రదేశ్‌లోని సిమ్లాలో జరిగిన త్రోబాల్ జాతీయస్థాయి పోటీలో తెలంగాణ రాష్ట్రం తరఫున పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

హాకీ పోటీల్లో: బీ 2022-23 సంవత్సరంలో రంగారెడ్డి జిల్లా నందిగామలో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ పోటీలో పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. బీ 2023-24 సంవత్సరంలో మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాఠశాలకు



చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా కోటాలో ఉద్యోగం సాధించాలని

నెక్కంటి సాయి జశ్వంతి, 10వ తరగతి

గత రెండేళ్లలో ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి త్రోబాల్ పోటీల్లో పాల్గొన్నాను. గతేడాది నాలుగో స్థానం పొందాను. రోజుకు 2గంటల పాటు సాధన చేస్తున్నాను. క్రీడా కోటాలో భవిష్యత్తులో ఉద్యోగం సాధించడం నా లక్ష్యం. కొత్త ప్రాంతానికి వెళ్లినప్పుడు ఒత్తిడి, కంగారు ఉన్నప్పటికీ నిర్దేశించుకున్న లక్ష్యం గుర్తుంచుకుని ముందుకు వెళ్తున్నాను. ఇంట్లో అమ్మ, పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు నన్ను ప్రోత్సహిస్తున్నారు.

నాన్న ప్రోత్సాహంతో:కట్ట అఖిల్‌నందన్, 9వ తరగతి

పాఠశాలలో ఆడించే ఆటల్లో హాకీ నన్ను ఆకట్టుకుంది. నాన్న ఎప్పటికప్పుడు హాకీ కిట్లు కొనిస్తూ ప్రోత్సహిస్తున్నారు. రోజుకు రెండు గంటలు సాధన చేస్తున్నాను. గతేడాది రంగారెడ్డి జిల్లాలో జరిగిన పోటీల్లో నాలుగో స్థానం, మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన పోటీలలో రెండో స్థానంలో మా జట్టు నిలిచింది. పోటీల్లో గెలిచి వచ్చినపుడు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించడం మరింత ప్రోత్సాహాన్ని ఇస్తోంది. భవిష్యత్తులో తెలంగాణ తరుపున జాతీయ పోటీలకు వెళ్లాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాను.

# ప్రకృతిలో..వికృతి..!

కోదాడ :ఈ చిత్రంలో గేట్లు ఊడిపోయి కనిపిస్తున్న పట్టణ ప్రకృతి వనం కోదాడ పట్టణంలోనిది. రెండేళ్ల క్రితం అధికారులు సుమారు రూ.4 లక్షల ఖర్చుతో ఏర్పాటు చేశారు. మొక్కలు నాటి, చుట్టూ కంచె, గేట్లు బిగించి వదిలేశారు. పర్యవేక్షణ లేకపోవడంతో మొక్కలు ఎండిపోయాయి. కంచె తొలగిపోయింది. గేట్లు ఊడిపోయాయి. అధికారులు అలసత్వం వహిస్తున్నారనడానికి ఈ ప్రకృతి వనమే సాక్ష్యం. ఇలాంటి చిత్రాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు పట్టణాల్లో కనిపిస్తాయి. పట్టణాల్లో ఎక్కడ చూసినా భవనాలే. వాహనాలతో కాలుష్యం విపరీతంగా ఉంటోంది. కాలుష్యాన్ని నివారించడంతో పాటు, పట్టణాల్లో పచ్చదనం పెంపే లక్ష్యంగా ప్రభుత్వం పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేసింది. వార్డుల్లోని ఖాళీ స్థలాల్లో, నూతన వెంచర్లలో ప్రభుత్వానికి కేటాయించిన స్థలాల్లో రూ.లక్షలు వెచ్చించి వీటిని ఏర్పాటు చేసింది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో పట్టణ ప్రకృతి వనాల్లో ఎండిపోయిన మొక్కలే దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల బోర్డులే మిగిలి ఉన్నాయి. అధికారులు వాటి పర్యవేక్షణ గాలికొదిలేయడంతో ప్రభుత్వ



లక్ష్యం నీరుగారిపోయింది.

రూ. కోట్లు వెచ్చించినా.. పచ్చదనం కరవే

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 19 మున్సిపాలిటీల్లో 300లకు పైగా పట్టణ ప్రకృతి వనాలు ఉన్నాయి. వీటి కోసం సుమారు రూ.10 కోట్లకు పైగా నిధులు ఖర్చు చేశారు. ఇంత భారీ స్థాయిలో నిధులు ఖర్చు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. పండ్ల, ఔషధ, పూల మొక్కలు, పాదచారులకు బాట ఇలా ఎన్నో అంచనాల మధ్య వీటిని ప్రభుత్వం నిర్మించింది.

నిర్వహణపై దృష్టి సారిస్తాం:వెంకటేశ్వరనాయక్, పుర కమిషనర్, కోదాడకోదాడ పట్టణంలోని కొన్ని పట్టణ ప్రకృతి వనాల్లో మొక్కలు ఎండిపోయిన మాట వాస్తవమే. ఇప్పటి నుంచి వాటి నిర్వహణపై దృష్టి సారిస్తాం. మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు చేపడతాం. ఊడిన గేట్లకు మరమ్మతులు చేయించి, కంచె ఏర్పాటుతో పాటు మొక్కలు ఎండిపోకుండా నిత్యం నీళ్లు పోయిస్తాం.

# ఆకలితో పాఠం అర్థమైతలేదు



పెద్దపల్లి : ప్రభుత్వ విద్యాలయాల్లో పదో తరగతిలో వంద శాతం ఫలితాల సాధనే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. మండలానికి ఒక జిల్లా అధికారి చొప్పున విద్యార్థుల సన్నద్ధత తీరును పర్యవేక్షిస్తున్నారు. ప్రతి రోజూ వేకువజామునే పిల్లలు లేచి చదువుకొనేలా తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు ఫోన్ చేస్తున్నారు. అంతా బాగానే ఉన్నా విద్యార్థులు ప్రత్యేక తరగతులకు ఖాళీ కడుపుతోనే హాజరవుతుండటంతో పాఠాలు అర్థం కావడం లేదు. గత ప్రభుత్వం దసరా సెలవులకు ముందు ప్రారంభించిన సీఎం అల్పాహార పథకం ఎక్కడా అమలు కావడం లేదు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక చొరవ చూపుతున్న కలెక్టర్ అల్పాహారం అందించడానికి నిధులు మంజూరు చేస్తే సత్ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.

వెనుకబడిన వారిపై శ్రద్ధ

జిల్లాలో 104 జడ్పీ పాఠశాలలు, 7 కస్తూర్బా, 1 మైనార్టీ, 7 ఆదర్శ, 7 సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పదో తరగతి విద్యార్థులు మొత్తం 4,594 మంది ఉన్నారు. ప్రతిభ ఆధారంగా చురుగ్గా ఉన్న వారిని ఏ, సగటు విద్యార్థులను బీ, వెనుకబడిన వారిని సీ.. ఇలా మూడు విభాగాలుగా వర్గీకరించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సన్నద్ధం చేస్తున్నారు.

దూర ప్రాంతాల వారికి కష్టాలు

పదో తరగతి విద్యార్థులకు కొంతకాలంగా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. నిత్యం ఉదయం 8.30 గంటల నుంచి 9.35 గంటలు, సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు పాఠ్యాంశాలపై పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యేలా ప్రోత్సహిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో వస్తున్నారు. బస్సులు వేళకు రాకపోవడంతో చాలా మంది తరగతులకు హాజరు కాలేకపోతున్నారు. అలాగే సాయంత్రం వేళ ముందుగానే వెళ్లాల్సి వస్తోంది. ఉపాధ్యాయులు కూడా దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తుండటంతో ఆలస్యమై సాధనకు ఆటంకంగా మారుతోంది.

నిధులు మంజూరు చేస్తేనే ప్రయోజనం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ఎక్కువ మంది పేదలే ఉంటున్నారు. ఉదయాన్నే దూర ప్రాంతాల నుంచి బడికి చేరుకోవాల్సి ఉండటంతో ఆ సమయంలో ఇళ్లలో వంట కాక ఏమీ తినకుండానే వస్తున్నారు. మధ్యాహ్న భోజన సమయం వరకు ఆకలితోనే పాఠాలు వింటున్నారు. దీంతో ఉపాధ్యాయులు బోధించే అంశాలపై ఏకాగ్రత కుదరడం లేదని వాపోతున్నారు. సాయంత్రం కూడా ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. పాఠశాలల్లో విద్యా బోధనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న కలెక్టర్ స్పందించి అల్పాహారం ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తే ఈ సమస్య పరిష్కారం కానుంది. తద్వారా ఉత్తీర్ణత శాతం కూడా పెరగనుంది.

జిల్లాలో పదో తరగతి విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలలు: 2,609

ఆదర్శ: 615

కేజీబీవీలు: 425

సాంఘిక సంక్షేమ గురుకులాలు: 424

బీసీ గురుకులాలు: 392

మైనార్టీ గురుకులాలు: 129

ఏకాగ్రత కుదరడం లేదు

మాది బిట్టుపల్లి. 8 కి.మీ.ల దూరంలోని వెక్లాస్‌పూర్‌లో చదువుతున్నా. ఉదయం ఏం తినకుండానే ప్రత్యేక తరగతులకు హాజరవుతుండటంతో పాఠాలు సక్రమంగా అర్థం కావడం లేదు. ఉపాధ్యాయులు సందేహాలు విషయాలను నివృత్తి చేస్తూ సాధన చేయిస్తున్నా ఆకలితో ఏకాగ్రత కుదరడం లేదు.

వైష్ణవి, వెక్లాస్‌పూర్ జడ్పీ ఉన్నత పాఠశాల, మంథని మం.

సందేహాలు నివృత్తి చేసుకుంటున్నాం

ఖాళీ కడుపుతోనే ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నా. మా బడిలో చాలా మంది పరిస్థితి ఇదే. మధ్యాహ్న భోజనం వరకు ఆకలితోనే పాఠాలు వింటున్నాం. సహచర విద్యార్థులతో చర్చిస్తూ సందేహాలు నివృత్తి చేసుకుంటున్నాం. అల్పాహారానికి నిధులు మంజూరు చేస్తే బాగుంటుంది.

శ్రుతి, అప్పన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాల, పెద్దపల్లి మం.

రూ.10 చొప్పున కేటాయింపు

విద్యార్థుల ఆకలి తీర్చేందుకు కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. ప్రతి విద్యార్థికి రూ.10 చొప్పున కేటాయించారు. రెండు, మూడు రోజుల్లో పాఠశాలల ఖాతాల్లో ఇవి జమ కానున్నాయి. మెరుగైన ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా ప్రత్యేక దృష్టి సారించాం.మాధవి, జిల్లా విద్యాధికారి

# బడ్జెట్ రెండింతలు.. పూర్తవ్వాలి పనులు




సిరిసిల్ల: జిల్లాలో ప్రతిష్ఠాత్మకమైన కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైనుకు కేంద్ర బడ్జెట్‌లో ఊరట లభించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో నిర్మించే ఈ ప్రాజెక్టుకు గతేడాది కేంద్ర బడ్జెట్‌లో రూ.185 కోట్లు కేటాయించగా ఈ సారి దానికి రెట్టింపుగా రూ.350 కోట్లు ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ వంతుగా భూసేకరణ చేపట్టాలి. దీనిలో సిద్దిపేట-సిరిసిల్ల వరకు పూర్తయింది. ఈ ప్రాంతంలో రైల్వేలైను నిర్మాణానికి దక్షిణ మధ్య రైల్వే టెండర్లు కూడా పూర్తి చేసింది. వారు పనులు ప్రారంభించడమే తరువాయి. వేములవాడ, బోయినపల్లి, చొప్పదండి, రామడుగు మధ్య భూసేకరణ అసంపూర్తిగా ఉంది. 2020-21లో నిర్మాణ పనులు ప్రారంభించిన ఈ ప్రాజెక్టు 2025-26 నాటికి కొత్తపల్లికి రైలు చేరుకోవాలనేది లక్ష్యం. ప్రస్తుతానికి సికింద్రాబాద్ నుంచి మనోహరాబాద్, సిద్దిపేట వరకు రైలు నడుస్తుంది. జిల్లా వాసుల చిరకాల వాంఛ అయిన రైలు ప్రయాణం ఈ ఏడాది చివరి నాటికైనా సాకారమవుతుందో లేదో చూడాలి.జిల్లాలో రైల్వేలైను కోసం 946.20 ఎకరాలు అవసరమని గుర్తించారు. దీనిలో ప్రభుత్వ భూమి పోగా ప్రైవేటుగా 356 ఎకరాలు సేకరించాలి. సిరిసిల్ల, వేములవాడ, బోయినపల్లి వరకు విడతల వారీగా భూసేకరణ, పరిహారం పంపిణీ పూర్తయింది. తొలుత తంగళ్లపల్లి మానేరు వంతెన పక్క నుంచి ఆర్అండ్ఆర్ కాలనీల మీదుగా వేములవాడ పట్టణాన్ని ఆనుకుని ఈ రైల్వేలైనుకు ప్రణాళిక ఉండేది. జిల్లా ఆవిర్భావంతో కలెక్టరేట్, జిల్లా పోలీసు అధికారి కార్యాలయాలు, ఆర్అండ్ఆర్ కాలనీలు వచ్చాయి. దీంతో రైల్వేలైను భూసేకరణకు ఇబ్బందులు తలెత్తుతాయని తంగళ్లపల్లి మండలం చీర్లవంచ మీదుగా నాంపల్లికి అలైన్‌మెంటులో మార్పులు చేశారు. గత ప్రభుత్వ హయాంలో రాజరాజేశ్వర జలాశయం వెనక జలాలపై రైల్వే, రహదారి వంతెన నిర్మాణానికి ప్రణాళికలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్మించాల్సిన ఈ వంతెన ప్రభుత్వం మారడంతో టెండర్ల దశలో ఉంది.

ఇవీ ఉపయోగాలు

ఈ రైలు మార్గం ముఖ్య ఉద్దేశం రవాణా సౌకర్యాలు విస్తరిస్తే ఈ ప్రాంతంలో వ్యాపార, వాణిజ్యం విస్తరిస్తుంది.

చొప్పదండి, వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల మీదుగా పంట ఉత్పత్తులు, గ్రానైట్ రవాణా చేయవచ్చు.

రహదారుల గుండా రవాణా చేస్తే ఖర్చు అధికమవుతుంది. అధిక సంఖ్యలో లారీలు వెళ్లడం ద్వారా రహదారులు ధ్వంసం కావడం, రద్దీతో ప్రమాదాలకు దారితీస్తోంది. రహదారి ప్రమాదాలు కూడా నివారించవచ్చు.

ఈ రైల్వేలైను పరిధిలో మెదక్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలు వస్తాయి. వీటిలో కొమురవెల్లి మల్లన్న, కొండపోచమ్మ, వేములవాడ రాజన్న, నాంపల్లి లక్ష్మీనృసింహస్వామి, కొండగట్టు అంజన్న పుణ్యక్షేత్రాల సమీపం నుంచి వెళ్తుంది. దైవదర్శనాలకు వెళ్లే భక్తులకు రైలు ప్రయాణం కలుగుతుంది.

సికింద్రాబాద్ నుంచి కాజీపేట మీదుగా దిల్లీ వెళ్లే మార్గానికి ఉమ్మడి జిల్లావాసులకు మరోమార్గం అందుబాటులోకి వస్తుంది. అలాగే ముంబయి, షిర్డీ పట్టణాలకు ఈ రైలు మార్గం అనువుగా ఉంటుంది.

# అవిశ్వాసం నెగ్గేనా? వీగేనా?

ఇల్లెందు : ఇల్లెందు పుర ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారు. అవిశ్వాసం నెగ్గటానికి భారాస కౌన్సిలర్లు, వీగడానికి అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. భారాస కౌన్సిలర్లు 14 మంది గోవా శిబిరానికి తరలివెళ్లారు. కౌన్సిలర్లు అంకెపాక నవీన్, వార రవి, మొగిలి లక్ష్మితో కలిసి ఛైర్మన్ డీవీ నాలుగు రోజుల క్రితం మంత్రి పొంగులేటిని హైదరాబాద్‌లో కలిశారు. తిరిగి ఇల్లెందుకు రాలేదు. ఎమ్మెల్యే కోరం కనకయ్య ఇప్పటికే పురవైస్ ఛైర్మన్ జానీపాషా, 12వ వార్డు కౌన్సిలర్ భర్త సిలివేరు సత్యనారాయణతో రహస్య మంతనాలు సాగించినట్లు సమాచారం. మరికొందరు భారాస కౌన్సిలర్లతో చర్చలు జరుపుతున్నారు. అవిశ్వాస తీర్మానంలో మొత్తం 24 మంది కౌన్సిలర్లతోపాటు ఎమ్మెల్యేకు ఓటుహక్కు ఉంటుంది. తీర్మానం ప్రవేశపెట్టాలంటే కనీసం 17 మంది కౌన్సిలర్లు తప్పకుండా సోమవారం హాజరు కావాలి. 17 మందికంటే ఒక్కరు తక్కువగా చేతులు ఎత్తినా అవిశ్వాసం వీగిపోతుంది. ఈ లెక్కలు వేసుకున్న అధికార, ప్రతిపక్ష నాయకులు ఎవరికి వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

# మట్టి.. పైసల బట్టి..!

నల్గొండ : ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఇటుక బట్టీల వ్యాపారం అక్రమాల పుట్టగా మారింది. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి అనుమతులు లేకుండానే పంట పొలాల మధ్య బట్టీలను నిర్వహిస్తున్నారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర(నాలా) మార్పిడి చేయాల్సి ఉన్నా అవేమీ పట్టించుకోకుండా యథేచ్ఛగా ఇటుకలు తయారీ చేస్తున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీ రూ.కోట్లల్లో కొల్లగొడుతున్నారు. మరోవైపు పరిశ్రమలు ఏర్పాటు చేసిన వాటికి పంట పొలాలుగా చూపిస్తూ రైతుబంధు కాజేస్తున్నారు.

రాజధానికి సమీపంగా ఉంటూ..

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నిర్మాణ రంగం జోరుగా కొనసాగుతోంది. దీంతో మట్టి ఇటుకలకు డిమాండ్ ఏర్పడింది. రాజధాని నగరానికి సమీపంలో ఉమ్మడి జిల్లా ఉండటంతో ఇక్కడ ఇటుక వ్యాపారం ఊపందుకుంది. ప్రధానంగా నల్గొండ పట్టణ సమీపంలోని మామిళ్లగూడ, ఆర్జాలబావి, బుద్దారం, గంధవారిగూడం, మాడ్గులపల్లి మండల పరిధిలోని గంధ్రవాని గూడెం, తోపుచర్ల, చెరువుపల్లి, చండూరు మండల పరిధిలోని ఇడికూడ, బంగారిగడ్డ, అంగడిపేట,



కట్టంగూరు నుంచి నల్గొండ వెళ్లే మార్గంలో, దేవరకొండ పట్టణంలోని డిండిరోడ్డు, చందంపేట మండలంలోని బొగ్గులదోణ, బాపనకుంట ప్రాంతాలతో పాటు సుమారు 410కి పైగా ఇటుక పరిశ్రమలు కొనసాగుతున్నాయి. ఇందులో చాలా వరకు అనుమతులు లేవు.

ఉచితం మాటున..

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఉచిత విద్యుత్తు అందిస్తోంది. కొందరు ఇటుక బట్టీల వ్యాపారులు పంట పొలాలకు చెందిన వ్యవసాయ బోరుబావులను ఉచితం మాటున ఇటుక పరిశ్రమలకు వాడేస్తున్నారు. అక్కడే పనిచేస్తున్న కార్మికుల గృహావసరాలకు కూడా వ్యవసాయ విద్యుత్తును వినియోగిస్తున్నారు. ఈ దుర్వినియోగం ద్వారా ప్రతి నెల విద్యుత్తుశాఖ రూ.లక్షల్లో ఆదాయం నష్టపోతుంది.

రాయల్టీ ఎగనామం

ఇటుక బట్టీల నిర్వాహకులు సమీపంలోని చెరువులు, కుంటల నుంచి అనధికార తవ్వకాల ద్వారా నల్లరేగడి మట్టి సేకరిస్తున్నారు. ఇందుకు మైనింగ్, నీటిపారుదల శాఖ, రెవెన్యూశాఖల అధికారుల అనుమతి తప్పని సరి. వ్యాపారుల చేతివాటంతో అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారు రూ.200 కోట్లకు పైగా ఇటుకల తయారీ వ్యాపారం జరుగుతున్నా ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో చెల్లించాల్సిన ఆదాయానికి వ్యాపారులు ఎగనామం పెడుతున్నారు.

కేసులు నమోదు చేస్తాం:చంద్రమోహన్, ఎస్ఈ, విద్యుత్తు సంస్థ

ఇటుక బట్టీలకు వ్యవసాయ విద్యుత్తు వినియోగిస్తే చర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయిలో విజిలెన్స్ తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయిస్తాం. ఇటుక తయారీ వ్యాపారులు ప్రత్యేకంగా వాణిజ్య పరమైన విద్యుత్తు సర్వీసులు తీసుకోవాలి. విద్యుత్తు వినియోగిస్తున్నట్లు సమాచారం ఇస్తే తక్షణమే చర్యలు చేపడుతాం.

# పర్యవేక్షణ లేక.. నాణ్యత కానరాక..!

ఖమ్మం : ప్రభుత్వ పాఠశాలలపై సరైన పర్యవేక్షణ లేకపోవటంతో విద్యా వ్యవస్థ కుంటుపడుతోంది. ఒకప్పుడు పటిష్టంగా ఉన్న వ్యవస్థ రానురాను దెబ్బతింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, నాణ్యమైన భోజనం అంతంతమాత్రంగానే అందుతోందనే విమర్శలున్నాయి.

గతంలో పటిష్ఠ నిఘా..గతంలో డివిజన్ స్థాయిలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉండే వారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం, మధిర, కొత్తగూడెంలో ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయాలు ఉన్నాయి. డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ల పరిధిలో ప్యానల్ ఇన్‌స్పెక్షన్ టీం ఉండేది. ఈ బృందంలో మొత్తం ఆరుగురు సభ్యులు ఉంటారు. వీరు తరచు పాఠశాలలను సందర్శించడం, తనిఖీలు నిర్వహించటం, అవసరమైన సలహాలు సూచనలు ఇచ్చే వారు. మంజూరైన నిధులకు సంబంధించిన సోషల్ ఆడిట్ నిర్వహించే వారు. ఇప్పుడు ఇలాంటి వ్యవస్థ లేదు. ఎంఈఓ స్థాయిలో గతంలో ఉన్న పర్యవేక్షణ బృందం ఇప్పుడు లేదు. 21 మండలాల్లో ఖమ్మం, సత్తుపల్లిలో మాత్రమే రెగ్యులర్ ఎంఈఓలు ఉన్నారు.

కమిటీల్లో ఖాళీలే..ప్రస్తుతం మధ్యాహ్న భోజనంపై పర్యవేక్షణ పూర్తిగా కరవైంది. దీంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు. ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో పర్యవేక్షించేందుకు 2006 నవంబరులో ప్రభుత్వం జీఓ నెం.318 ఉత్తర్వులను విడుదల చేసింది. రాష్ట్రస్థాయిలో



ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేసింది. జిల్లాస్థాయిలో అసిస్టెంట్ డైరెక్టర్, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్‌తో కమిటీని ఏర్పాటు చేసింది. కానీ 2006 నుంచి ఈ పోస్టులను నింపలేదు. జిల్లాల పునర్విభజన తర్వాత మధ్యాహ్న భోజన పర్యవేక్షణకు మరో కమిటీని ఏర్పాటు చేశారు. ఒక అసిస్టెంట్ డైరెక్టర్, సూపరింటెండెంట్, ఏఎస్ఓతో పాటు ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లతో కమిటీ వేశారు. వీటిలో ఒకటి రెండు తప్ప మిగతా పోస్టులను ఇంత వరకు నింపలేదు. ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా పోస్టులను అధికారులు నింపడం లేదు. దీంతో వంట ఏజెన్సీలు ఇష్టారాజ్యంగా వండి పెడుతున్నా పట్టించుకున్న నాథుడు లేడు.త్వరలో పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేస్తాం. ప్రస్తుత అధికారుల ద్వారా ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పాఠశాలల పర్యవేక్షణ, మధ్యాహ్న భోజనం పథకంపై ప్రత్యేక దృష్టి పెట్టి పని చేస్తున్నాం. ఈ.సోమశేఖరశర్మ, డీఈఓ, ఖమ్మం

# పడకేసిన పారిశుద్ధ్యం..!

మణుగూరు : అశ్వాపురం మండలంలో మొండికుంట గ్రామ పంచాయతీ సర్పంచి మర్రి మల్లారెడ్డి, ఉప సర్పంచి మేడవరపు సుధీర్ పారిశుద్ధ్య కార్మికులుగా అవతారమెత్తారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె మొదలైనప్పటి నుంచి వారు ఇలా సర్పంచి ట్రాక్టర్ నడుపుతూ ఉప సర్పంచి తడి పొడి చెత్తలను, చెదారాలను సేకరిస్తూ స్వయంగా డంపింగ్ యార్డుకు తరలించే కార్యక్రమాలను చేపడుతున్నారు.పంచాయతీ కార్మికుల సమ్మె నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేస్తోంది. చెత్తా చెదారాలు పేరుకుపోతూ గ్రామాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈనెల 6 నుంచి గ్రామ పంచాయతీ కార్మికులు నిరవధిక సమ్మెకు పూనుకున్న విషయం విదితమే. జిల్లాలోని 23 మండలాల పరిధిలోని 481 గ్రామపంచాయతీల్లో 1,657 మంది పంచాయతీకార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు.

వేతనం రూ. 8,500

పంచాయతీ కార్మికులకు నెలకు ప్రస్తుతం రూ. 8,500 వేతనంగా చెల్లిస్తున్నారు. అది గ్రామ పంచాయతీల నుంచే. నిధుల లభ్యతను బట్టి వేతనాల చెల్లింపుల్లో వెనుకాముందు అవుతోంది. అందరినీ మల్టీ పర్పస్ కార్మికులుగా గుర్తించారు. పంచాయతీ కార్మికులు ప్రస్తుతం ట్రాక్టర్ డ్రైవర్లుగా, వాటర్‌మెన్‌గా, ఎలక్ట్రీషియన్లుగా, పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్నారు. గ్రామాల్లో వీధులు, రహదారులను శుభ్రం చేస్తున్నారు. మురుగు కాల్వల్లో పూడిక తీస్తున్నారు. తరుణ వ్యాధులు తలెత్తకుండా బ్లీచింగ్, ఫాగింగ్ చేస్తున్నారు. ట్రాక్టర్ ద్వారా ఇంటింటికి తిరుగుతూ చెత్త, చెదారాలు సేకరించి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. ఇప్పుడు వీరు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మెకు పూనుకున్నారు.

డిమాండ్లు ఇవే..

జీవో నంబర్ 51 సవరించాలి. గ్రామ పంచాయతీ నుంచి కాకుండా



రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించాలి. మల్టీపర్పస్ విధానాన్ని ఎత్తివేయాలి. కార్మికులు, ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి. రూ. 19 వేలు వేతనంగా చెల్లించాలి. రూ. 10లక్షల ఆరోగ్య బీమా, ప్రమాద బీమా అమలు చేయాలి. ఏటా అందించే ఏకరూప దుస్తులు, చెప్పులు, సబ్బులు, నూనెలకు బదులు డబ్బులను అలవెన్సుల రూపంలో అందజేయాలి. విధి నిర్వహణలో మృతి చెందితే రూ10 లక్షలు పరిహారంగా అందజేయాలి. పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ సౌకర్యాలను కల్పించాలి. ట్రాక్టర్ డ్రైవర్లకు లైసెన్సుల జారీతో పాటు ప్రమాదంలో మృతి చెందితే అంత్యక్రియలకు తక్షణ సాయంగా రూ. 30 వేలు ఇవ్వాలి. ఉన్నతాధికారుల వేధింపులను ఆపాలి.గ్రామ పంచాయతీ కార్మికుల, ఉద్యోగుల సమస్యలపై అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించాం. అయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో నిరవధిక సమ్మె బాట పట్టాం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలి. ఎటువంటి భేషజాలకు పోకుండా న్యాయబద్ధమైన పంచాయతీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి. లేకపోతే సమ్మెను ఇలాగే కొనసాగిస్తాం.

ఆర్.మధుసూదనరెడ్డి, గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగుల ఐకాస రాష్ట్ర కన్వీనర్15 ఏళ్లకు పైగా గ్రామ పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నాను. తొలుత వేతనంగా రూ. 1,000 ఇచ్చేవారు. తరవాత క్రమంగా పెంచుకుంటూ వచ్చారు. ప్రస్తుతం రూ. 8,500 ఇస్తున్నారు. పెరిగిన ధరలతో పోలిస్తే ఇవి ఎందుకూ సరిపోవడం లేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాల్లో కూడా మార్పులు చేయాలి. ఏదో ఒక పనిని మాత్రమే అప్పచెప్పాలి. మల్టీపర్పస్ విధానం బాగాలేదు. సెలవు ఇవ్వాలి. ఉన్నతాధికారులు వేధింపులు మానుకో వాలి.గద్దల శివకృష్ణ, పంచాయతీ మల్టీపర్పస్ కార్మికుడు

# పిల్లలకు ఇబ్బందులు రానీయొద్దు

తాడ్వాయి : జిల్లాలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో పనిచేసే ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు విద్యార్థుల బాగోగులపై ప్రత్యేక దృష్టిసారించాలని ఐటీడీఏ పీవో అంకిత్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. కొందరికి ఏకరూపదుస్తులు లేకపోవడాన్ని గమనించి వెంటనే అందించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారుల సహకారంతో ఆరోగ్యపరీక్షలు చేయించాలని, దీర్ఘకాలిక ఆరోగ్యసమస్యలు ఉంటే ప్రత్యేక వైద్యం అందించాలని సూచించారు. వంటశాలను పరిశీలించి మెనూ ప్రకారం శుభ్రంగా, రుచిగా వండి వడ్డించాలన్నారు. కొన్ని తరగతి గదుల్లో ట్యూబులైట్లు లేకపోవడాన్ని గమనించి వెంటనే అమర్చాలని గిరిజనసంక్షేమశాఖ ఈఈ హేమలతకు ఫోన్లో సూచించారు. గిరిజన సహకారసంస్థ సరఫరా చేసే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి దిగుమతి చేసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు పద్మ, వసతిగృహ సంక్షేమాధికారి లక్ష్మీకి సూచించారు.

జాకారంలోని మినీ గిరిజన గురుకుల పాఠశాలను మంగళవారం ఐటీడీఏ పీవో అంకిత్ సందర్శించారు. వసతులపై ప్రిన్సిపల్ లతను ఆరా తీశారు. ఉపాధ్యాయులు నిర్మల, పూల్‌బాయి, రజిత, మణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

గోవిందరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఐటీడీఏ పీఓ అంకిత్ తనిఖీ చేశారు. వైద్యాధికారి సుకుమార్, ఫార్మాసిస్టులతో మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభం కావడం వల్ల పాము, తేలు కాటుకు సంబంధించిన వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఐదు సబ్ సెంటర్లలో ఔషధ లభ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. బర్త్ వేయిటింగ్ హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయంతో పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా జరిగేట్లు చూసుకోవాలని ఆదేశించారు. ప్రధాన ఆసుపత్రి భవనం లీకేజీ సమస్యను పీఓ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన స్పందించి మరమ్మతులు చేపట్టాలంటూ ఐటీడీఏ ఈఈని చరవాణీ ద్వారా ఆదేశించారు.

# మీనం.. కలిసిరాని కాలం



ఖమ్మం : వానాకాలం సీజన్ రెండో నెలలోనూ వర్షాలు ముఖం చాటేయడంతో అనుబంధ రంగాలపైనా ప్రతికూల ప్రభావం కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలోనే ఏకైక చేపల ఉత్పత్తి కేంద్రంగా ఉన్న వైరాలోని మత్స్యవిత్తన క్షేత్రంలో ఈసారి చేపపిల్లల ఉత్పత్తి ఛాయలే కనిపించలేదు. స్థానిక ఉత్పత్తి కేంద్రంలో ఏటా కట్ల, రోహు, మృగాల, బంగారుతీగ రకం చేపపిల్లలను ఉత్పత్తి చేస్తుంటారు. వర్షాలు సజావుగా కురిస్తే జూన్ మూడో వారం నుంచే సన్నాహాలు మొదలై వెంటనే ఉత్పత్తి ప్రారంభిస్తారు. కానీ ఈసారి ఆ పరిస్థితి ఇక్కడ లేదు.

లక్ష్యం ఇలా.. ఈసారి ఉత్పత్తి లక్ష్యం తగ్గించారు. స్థానిక మత్స్య విత్తన క్షేత్రంలో వనరుల సరిగా లేకపోవడంతో ఈసారి కట్ల, రోహు, మృగాల రకం చేప పిల్లల ఉత్పత్తి లక్ష్యం కేటాయించలేదని అధికారులు చెబుతున్నారు. కేవలం బంగారుతీగ రకంను కోటి వరకు(స్పాన్ అంటే గుడ్డు నుంచి బయటకు వచ్చే దశ) ఉత్పత్తి చేస్తారు. వీటి నుంచి చివరకు 40 అంగుళాల పరిమాణం ఉన్న చేప పిల్లలు 15 లక్షల వరకు ఉత్పత్తి చేయాలనే లక్ష్యాన్ని విధించారు. వీటితోపాటు దోమల నియంత్రణకు అవసరమైన గంబూషియా చేప పిల్లలను జిల్లాలో పురపాలకాలకు, గ్రామ పంచాయతీలకు వైరాలోని ఇక్కడ క్షేత్రం నుంచే పంపిణీ చేయాల్సి ఉంది. ఇటీవల వరంగల్లు నుంచి గంబూషియా చేప పిల్లలను తీసుకొచ్చినా వర్షాలు లేకపోవడం, ఎండల పెరగడంతో కనిపించే పరిస్థితి లేకుండా పోయింది. ఇదే విత్తన క్షేత్రంలో కొర్రమీను చేప పిల్లలను ఉత్పత్తి చేయాల్సి ఉంది. తెలంగాణలోనే ప్రయోగాత్మకంగా కొర్రమీను చేప పిల్లలను ఉత్పత్తి చేసేందుకు వైరాలోని మత్స్య విత్తన క్షేత్రాన్ని ఐదేళ్ల క్రితమే ఎంపిక చేశారు. దీని కోసం భువనేశ్వర్ లోని సిఫా శాస్త్రవేత్తలతో ఒప్పందం చేసుకుంది. దీనికోసం నిధులు కేటాయించారు. ఈ నేపథ్యంలో గతేడాది సీజన్‌లో ఇక్కడ అతికష్టంగా 20 అంగుళాల పరిమాణం ఉన్న 1,500 కొర్రమీను చేప పిల్లలను ఉత్పత్తి చేశారు. కానీ ఈసారి ప్రతికూల ప్రభావంతో వీటి ఉత్పత్తి చేస్తారా? చేయలేరా? అన్న మీమాంసలో అధికారులు సైతం ఉన్నారు.

వసతులు లేక.. నిధులు రాక

స్థానిక మత్స్య విత్తన క్షేత్రంలో కొన్నేళ్ల క్రితం మూడు కోట్ల చేప పిల్లల స్పాన్ ఉత్పత్తి లక్ష్యం ఉండేది. వసతులు లేకపోవడంతో అది ఏటా తగ్గుతూ వస్తుంది. తల్లి చేపలు పెంచే మట్టికొలనులు సరిగా లేకపోవడం, ప్రక్రియ కొనసాగించే సిమెంటు తొట్లు పాడవ్వడం, విద్యుత్తు, పైపులైన్ల సమస్య, మోటార్ల సమస్య ఉంది. వీటికితోడు ఇక్కడ సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. స్థానిక కేంద్రానికి ఎఫ్‌డీవో అధికారిగా ఉండాల్సి ఉంది. కానీ ఇక్కడ ఎఫ్‌డీవో నాలుగు నెలల క్రితం సస్పెన్షన్‌కు గురయ్యారు. దీంతో ఇక్కడ అధికారి నియామకం జరగలేదు. ఖమ్మం నుంచి ఓ అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించారు. ఫీల్డ్‌మెన్లు, ఫిషర్‌మెన్లు తొమ్మిది మందికి నలుగురు మాత్రమే ఉన్నారు. దీనికితోడు ఉత్పత్తి ప్రక్రియ సజావుగా సాగేందుకు సుమారు రూ. 15 లక్షలతో ప్రతిపాదనలు పంపించినా మంజూరు కాలేదు. దీనికితోడు ప్రస్తుతం వర్షాలు లేకపోవడం, ఎండలు తగ్గకపోవడంతో ఉత్పత్తి ఎప్పటికి ప్రారంభమవుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది.వర్షాలు లేకపోవడంతో వైరాలోని మత్స్య విత్తన క్షేత్రంలో ఇప్పటి వరకు ఉత్పత్తి సన్నాహాలు చేయలేదు. వర్షాలు సజావుగా ఉంటే ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభించే వాళ్లం. వసతులు ఏ మాత్రం లేవు. సిబ్బంది కొరత ఉంది. దీంతో ఉత్పత్తి లక్ష్యం తగ్గించారు. ఉత్పత్తి సజావుగా సాగేందుకు నిధుల కోసం ప్రతిపాదించినా మంజూరు కాలేదు. వర్షాలు కురిసి ఎండలు తగ్గితేనే ఉత్పత్తి చేసే వీలుంది.ఆంజనేయస్వామి, మత్స్యశాఖ ఏడీ

# మణుగూరుకు పర్యాటక సొబగు



ఖమ్మం :మణుగూరు సబ్‌డివిజన్ పర్యాటకంగా అభివృద్ధి చెందనుంది. గోదావరి పరివాహక ప్రాంతం, అటవీ ప్రదేశాలు, సాగు నీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు ఉండటంతో రానున్న కాలంలో పర్యాటక ప్రాంతంగా విరాజిల్లనుంది. మణుగూరు, అశ్వాపురం, పినపాక మండలాలు పర్యాటక ప్రాంతాలుగా మారేందుకు అనుకూలంగా ఉన్నాయి.

గోదావరి నదిపై వంతెనమణుగూరు-పర్ణశాల వంతెన మణుగూరు ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల నాటి 'కల'. ఆ కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం వంతెన నిర్మించేందుకు సిద్ధమైంది. అశ్వాపురం మండలం కుమ్మరిగూడెం వద్ద సీతమ్మసాగర్ ఆనకట్టను ప్రభుత్వం నిర్మిస్తోంది. ఆనకట్ట మీద నుంచి పర్ణశాలకు అనుకూలంగా రాకపోకలు సాగించేందుకు అనువుగా ఉండనుంది. కుమ్మరిగూడెం నుంచి దుమ్ముగూడెం మండలం బైరాగులపల్లె గ్రామం వరకు ఆనకట్ట ఉండనుంది. అక్కడి నుంచి కి.మీ దూరంలో పర్ణశాల ఉంది. ఆనకట్ట నిర్మాణం పూర్తయితే పర్ణశాలకు రాకపోకలు పెరగనున్నాయి. అంతేకాకుండా గోదావరి నదిపై బోటు షికారు కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉంది. సీతారామ సాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువలు జలకళతో ఆకట్టుకోనున్నాయి.

ప్రత్యేక ఆకర్షణగా వెన్నెల జలపాతం

మణుగూరు రథంగుట్ట వద్ద వెన్నల జలపాతం ప్రతిఏటా కురిసే వర్షాలకు ఆకర్షణగా నిలుస్తుంది. గుట్టపై నుంచి ప్రవహించే పాల నురుగు లాంటి జలపాతానికి ఎంతో ప్రత్యేకత ఉంది. రథంగుట్ట వద్ద ఉన్న జలపాతానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చి సరదాగా గడుపుతున్నారు. సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉండటంతో అటవీ శాఖ సౌకర్యాలు కల్పించింది. రథంగుట్ట అర్బన్ పార్కుని ఏర్పాటు చేసింది. పార్కులో జపాన్, కేరళ కుటీరాలను నిర్మించారు.

రాకాసి గూళ్లు: పినపాక మండలం పాండురంగాపురం గ్రామంలో ఆదిమానవుల సమాధుల(రాకాసి గూళ్ళ)ను 15 ఏళ్ల క్రితం గుర్తించారు. వేల సంఖ్యలో ఉన్న రాకాసి గూళ్లు కొన్ని గ్రామాలకు విస్తరించి ఉన్నాయి. ఆరేళ్ల క్రితం రాకాసి గూళ్లను పురావాస్తు శాఖ అధికారులు పరిశీలించి ఆధీనంలోకి తీసుకొన్నారు. రాకాసి గూళ్ల ప్రదేశాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు పురావాస్తు శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది.మంచి అవకాశాలు ఉన్నాయి-రేగా కాంతారావు, ప్రభుత్వ విప్ మణుగూరు సబ్‌డివిజన్ ప్రాంతం పర్యాటక ప్రాంతాలుగా మారేందుకు మంచి అవకాశాలు ఉన్నాయి. మణుగూరులో అర్బన్ పార్కుని ఏర్పాటు చేశాం. సీతమ్మసాగర్ ప్రాజెక్టు పూర్తయితే ఇతర ప్రాంతాల నుంచి సందర్శకుల తాకిడి పెరగనుంది. అందుకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు నిధులను కేటాయిస్తాం.

# తప్పనున్న తాగునీటి గండం

ఖమ్మం : జిల్లాల్లోని వివిధ ప్రాంతాలతో పాటు మహబూబాబాద్ జిల్లాకు తాగునీటి సమస్య తీరనుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పాలేరు జలాశయం నీటిమట్టం గణనీయంగా తగ్గిపోయిన నేపథ్యంలో ఆయా ప్రాంతాలకు మిషన్ భగీరథ పథకం సాధ్యాసాధ్యాలపై పెద్దఎత్తున ఆందోళన వ్యక్తమైంది. ఈక్రమంలో ఈఎన్‌సీ అజయ్‌కుమార్‌కు ఖమ్మం జలవనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్ ప్రత్యేకంగా లేఖ రాశారు. ఈమేరకు సాగర్ జలాశయం నుంచి ఉన్నతాధికారులు నీటిని బుధవారం ఉదయం విడుదల చేయనున్నారు. రెండు రోజుల్లో పాలేరు జలాశయానికి నీరు చేరనుంది.

నిత్యం 2,345 లక్షల లీటర్ల వినియోగం

ఖమ్మం జిల్లాలోని కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, ఖమ్మం గ్రామీణం, ముదిగొండ, రఘునాథపాలెం, ఖమ్మం నగరంలోని సగభాగానికి పాలేరు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరందిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలు, మహబూబాబాద్ జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. వెరసి పాలేరు జలాశయం నుంచి 2,432 గ్రామాలు/ పట్టణాల్లోని 21.64 లక్షల మందికి రోజూ 2,345 లక్షల లీటర్ల చొప్పున అందిస్తున్నారు.

నీటిమట్టం తగ్గడంతో ఆందోళన



పాలేరు జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు. ప్రస్తుతం 11.30 అడుగులకు తగ్గిపోయింది. 2.558 టీఎంసీల నిల్వ సామర్థ్యమున్న జలాశయంలో 0.947 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఈఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఇన్‌ఫ్లో లేదు. ఎట్టకేలకు సాగర్ జలాశయం నుంచి నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తారు. తొలుత రెండు వేల క్యూసెక్కుల నీటిని వదులుతారు. క్రమేణా నాలుగు వేల క్యూసెక్కులకు పెంచుతారు. రెండు రోజుల్లో ఎడమకాల్వ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు సాగర్ జలాలు చేరుతాయి.శంకర్‌నాయక్, సీఈ, జలవనరుల శాఖ

# డీడీలు చెల్లించి పదేళ్లు.. కనెక్షన్లకు ఎన్నాళ్లు?

నూతన వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల కోసం అన్నదాతలు డీడీలు తీశారు. ఒకటీ రెండు కాదు.. పదేళ్ల క్రితం చెల్లించినా విద్యుత్తు అధికారులు చలించడంలేదు. రేపూ.. మాపూ అంటూ విద్యుత్తు సంస్థ అధికారులు తాత్సారం చేస్తున్నారని జిల్లా వ్యాప్తంగా వందలాది మంది రైతులు వాపోతున్నారు. కనీసం ఈ సీజన్‌లో అయినా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

1,826 మంది నిరీక్షణ

ఖమ్మం జిల్లాలోని 20 మండలాలకు సంబంధించి 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఇప్పటి వరకూ 5,142 మంది రైతులు వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరు కాక 2022 కంటే ముందు దరఖాస్తు చేసుకున్న 3,027 మందికి విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. గతంలో ఉన్న పెండింగ్ దరఖాస్తులతో కలుపుకొని ఇప్పటి వరకూ మొత్తం 8,169 మంది వ్యవసాయ విద్యుత్తు కోసం దరఖాస్తు చేయగా వారిలో 4,464 మందికి కనెక్షన్లు ఇచ్చారు. పలు కారణాలతో 1,879 దరఖాస్తులు తిరస్కరించగా 1,826 మంది రైతులకు అనుసంధించాల్సి ఉంది. వారంతా విద్యుత్తు సంస్థ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నారు.

బోర్లు, బావుల కింద సాగుకు..

సాగర్ జలాలు అందుబాటులో లేని భూములకు సంబంధించిన రైతులు బోర్లు, బావుల కింద సాగు చేసేందుకు వ్యవసాయ విద్యుత్తుపై ఆధారపడాల్సి ఉంది. ఇందుకోసం వారు నూతన వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల కోసం హార్స్‌పవర్(హెచ్‌పీ) స్థాయిని బట్టి జాతీయ బ్యాంకుల్లో డీడీలు తీసి విద్యుత్తు సంస్థ అధికారులకు అందజేయాల్సి ఉంది.



సంబంధిత మండలాల విద్యుత్తు సంస్థ సిబ్బంది ఆయా రైతుల భూమి వివరాలు, విద్యుత్తు స్తంభాల ఏర్పాటు, కనెక్షన్, అనుసంధాన నియంత్రికపై లోడ్ ప్రభావాన్ని లెక్కించి కనెక్షన్ ఇస్తారు. లోడ్ సరిపోకపోతే ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు నూతన విద్యుత్తు లైన్‌ను వేయాలనే ఆదేశాలున్నాయి. కానీ ప్రభుత్వ ఆదేశాలను విద్యుత్తు సంస్థ అధికారులు తుంగలో తొక్కారు. ఏళ్ల తరబడి డీడీలు చెల్లించినా వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వకపోవటంతో రైతులు సాగుకు ప్రత్యామ్నాయం లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

వందల సార్లు ప్రదక్షిణలు చేశా-వెంకటేశ్వర్లు, లచ్చుగూడెం

నాకు లచ్చుగూడెం రెవెన్యూలో 1.01 ఎకరాల వరి మాగాణి భూమి ఉంది. నా భూమికి సాగర్ జలాలు రావు. 2013లో పొలంలో బావి తీయించా. అదే ఏడాది డిసెంబరు 1న బస్వాపురం యూనియన్ బ్యాంక్‌లో రూ. 5వేల డీడీ తీసి విద్యుత్తు సంస్థ అధికారులకు ఇచ్చా. వందలసార్లు చింతకాని, ఖమ్మం విద్యుత్తు సంస్థ కార్యాలయాల చుట్టూ తిరిగినా కనెక్షన్ ఇవ్వలేదు. ఆ డీడీ సమయం దాటిపోయిందని విద్యుత్తు శాఖ అధికారులు 2022లో మళ్లీ డీడీ తీయమన్నారు. జూన్ 1న మీ సేవ కేంద్రంలో 5 హెచ్‌పీకి సంబంధించి రూ. 5,295 చెల్లించా. సంబంధిత రసీదును విద్యుత్తు సంస్థ అధికారులకు ఇచ్చా. డీడీలు చెల్లించిన రెండు రసీదులు నా వద్ద ఉన్నాయి. విద్యుత్తు సంస్థ అధికారులు కనెక్షన్ ఇస్తే ఈ ఏడాది అయినా మాగాణి పొలంలో వరి పంట సాగు చేసుకుంటా.

మూడు నెలల్లో విద్యుత్తు కనెక్షన్ ఇస్తున్నాం..ఎ.సరేందర్, ఎస్ఈ, విద్యుత్తు సంస్థ ఖమ్మంనూతన వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు సంబంధించి రైతులకు ఇబ్బందులు కలగనీయం. పదేళ్ల నుంచి కనెక్షన్లు ఇవ్వకుండా పెండింగ్ లో ఉన్న విషయం నా దృష్టికి రాలేదు. అర్హతలు ఉన్న దరఖాస్తులను పరిశీలించి మూడు, నాలుగు నెలల్లో ఇస్తున్నాం. రైతులు పంటలు పండిస్తుంటే కొంత ఆలస్యం అయ్యే అవకాశముంది.

# ముందే 'ముద్ర'.. 'రిజిస్ట్రేషన్' పక్కా!

వరంగల్ : రిజిస్ట్రేషన్ శాఖలో అవకతవకలు జరగకుండా ప్రభుత్వం పలు సంస్కరణలు చేపట్టింది. ఇందులో భాగంగా సబ్‌రిజిస్ట్రారు అథెంటిఫికేషన్ (ప్రమాణికరణ), ఆన్‌లైన్‌లో నాన్‌జుడీషియల్ స్టాంపుల విక్రయాల ప్రక్రియ మొదలు పెట్టింది. ఈ విధానాలు ఇప్పుడు ఉమ్మడి వరంగల్ జల్లా వ్యాప్తంగా అమలవుతున్నాయి. ఈ కొత్త విధానంలో అధికారులు, స్టాంపు విక్రయదారులు (వెండర్లు) మరింత జవాబుదారీతనంతో పని చేయాలి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. రోజుకు సుమారు 200 రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి.సమయం ఆదారిజిస్ట్రేషన్ ప్రక్రియలో విక్రయదారులు అభ్యంతరాలు చెప్పడం వల్ల ప్రతి రోజు చాలా దస్తావేజులు పెండింగ్‌లో ఉంటున్నాయి.. ఉమ్మడి జిల్లాలోని ప్రతి కార్యాలయంలో ప్రతి రోజు నాలుగైదు వరకు ఉంటున్నాయి. అమ్మకందారు అభ్యంతరం చెప్పగానే సదరు దస్తావేజుకు ఒక నెంబరు ఇచ్చి దానిని భద్రపరుస్తారు. కొన్ని వెంటనే పరిష్కారం అవుతున్నా మరికొన్ని ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి.

ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రస్తుతం సబ్‌రిజిస్ట్రారు అథెంటిఫికేషన్ ప్రక్రియను తీసుకొచ్చారు. ముందస్తుగా అమ్మకందారు అభ్యంతరం చెబితే దస్తావేజును పక్కన పెడుతున్నారు. దీనివల్ల మిగతా ప్రక్రియ పూర్తి చేయాల్సిన అవసరం ఉండదు. దీంతో సమయం ఆదా కావడమే కాదు సబ్‌రిజిస్ట్రారు జవాబుదారీతనం పెరుగుతుంది. గతంలో కూడా దస్తావేజులో సబ్‌రిజిస్ట్రారు సంతకం ఉండేది. అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చినప్పుడు దస్తావేజును తీసి పరిశీలించేవారు. ప్రస్తుతం బయోమెట్రిక్ ప్రక్రియ ఉంటుంది కాబట్టి క్షుణ్ణంగా పరిశీలించాకే రిజిస్ట్రేషన్ చేసే అవకాశం ఉంది. ఇలా చేయడం వల్ల దస్తావేజుల్లో ఎలాంటి తప్పులు దొర్లకుండా ఉంటాయి.

పాతవిధానంలో..రామ్మూర్తి తన భూమిని శ్రీనివాసుకు అమ్మాడు. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చి పత్రాలు సమర్పించారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ప్రక్రియ మొత్తం పూర్తి చేశారు. చివరకు సబ్‌రిజిస్ట్రారు వద్ద భూమి అమ్మిన వ్యక్తి వేలిముద్రలు వేసి సంతకాలు చేయాలి. ఈ సమయంలో సబ్ రిజిస్ట్రారు.. రామ్మూర్తిని డబ్బులు అన్ని అందాయా అని ప్రశ్నించారు. వెంటనే అందలేదని చెప్పడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగిపోయింది. పెండింగ్ కింద జమ చేసి పక్కన పెట్టారు.




అమరావతి, ఫిబ్రవరి 07: ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్‌గా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వైఎస్ షర్మిల చాలా దూకుడు ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా తన అన్న, ముఖ్యమంత్రి జగన్‌పై ఓ రేంజ్‌లో ఫైర్ అవుతున్నారు. ప్రజా సమస్యలపై, ప్రభుత్వ నిర్ణయాలపై తనదైన శైలిలో విమర్శలు గుప్పిస్తున్నారు. తాజాగా సీఎం జగన్ తీరును తూర్పారబడుతూ బహిరంగ లేఖ రాశారు వైఎస్ షర్మిల. రాష్ట్ర హక్కుల సాధన విషయంలో ప్రభుత్వ అనుసరిస్తున్న తీరును ఆమె విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అవసరమైతే కేంద్రంపై ఉమ్మడి పోరాటానికి సిద్ధమవ్వాలని ఇటు సీఎం జగన్, అటు ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడిని డిమాండ్ చేశారు షర్మిల.

**వైఎస్ షర్మిల రాసిన లేఖలోని సారాంశం..** 'ఆంధ్రప్రదేశ్ విభజన హామీల అమలు 5.5 కోట్ల ప్రజల హక్కు. వాటిని విస్మరించి, నిర్లక్ష్యం చేసి, రాష్ట్రాన్ని ఇంకా మోసం చేస్తూనే ఉంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. ఇందులో భాగంగా, విభజన హామీలు గుర్తు చేస్తూ కేంద్రంపై కలిసిపోరాడాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడుకి బహిరంగ లేఖలు రాయడం జరిగింది. హామీలపై అసెంబ్లీలో 'ఆంధ్ర రాష్ట్ర ప్రజల హక్కు' తీర్మానం చేసి కేంద్రానికి, రాష్ట్రపతికి పంపాలని ఈ లేఖల్లో మా డిమాండ్ ముందుంచాము. అలాగే యావత్ అసెంబ్లీ సభ్యులకు ఇదే నా మనవి. కలసి పోరాడదాం, మీ మీ పార్టీల తరుపున అసెంబ్లీ వేదికగా ఈ చర్చ కొనసాగించండి, అసెంబ్లీ తీర్మానానికి పట్టుబట్టండి. ఇది రాజకీయాలకతీతంగా అందరం చేయాల్సిన పోరు.' అని లేఖలో పేర్కొన్నారు వైఎస్ షర్మిల. 'ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం గడిచిన పదేళ్లలో అటు కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో మొదటి ఐదేళ్లు టీడీపీ, ఇప్పుడు వైసీపీ పూర్తి మెజారిటీతో అధికారంలో ఉన్నా పునర్విభజన చట్టంలో పొందుపరిచిన హామీలు ఒక్కటంటే ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోకపోవడం దురదృష్టకరం, అత్యంత బాధాకరం. నాడు తెలంగాణ ఏర్పాటులో భాగంగా విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరగకుండా అభివృద్ధి, పునర్నిర్మాణం అత్యంత వేగంగా జరగాలనే ఉద్దేశ్యంతో, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లో ప్రత్యేక హోదా సహా పోలవరానికి జాతీయ హోదా వంటి ముఖ్యమైన హామీలు పొందుపరచటం జరిగింది. కానీ విభజన అనంతరం కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీజేపీ ఆ హామీలను పూర్తిగా పక్కన పెట్టేసింది. నాడు బీజేపీతో పొత్తులో ఉన్న టీడీపీ పార్టీ, ఐదున్నర కోట్ల ప్రజల ఆశలను, ఆశయాలను తీర్చే హామీలను సాధించుకోవడానికి పోరాటం చేయలేదు. ఏపీ ప్రజలకు ఆనాడు మీరు చేసిన అన్యాయానికి మేము చింతిస్తున్నాం. రాష్ట్రానికి జరిగిన చారిత్రక అన్యాయాన్ని సరి చేస్తామనే వాగ్దానంతో 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. కానీ, పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది.' అంటూ తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు షర్మిల.

**అమలు కాని విభజన హామీలు..** తన లేఖలో అమలు కాని విభజన హామీలు అని కొన్ని అంశాలను ప్రస్తావించారు వైఎస్ షర్మిల. పోలవరం ప్రాజెక్టు జాతీయ హోదా, విశాఖ కేంద్రంగా నూతన రైల్వే జోన్, రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు వెనుకబడిన ప్రాంతాలకు నిధులు, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్, కొత్త రాజధాని నగర నిర్మాణం. ఇవి కాకుండా భవిష్యత్తు కోసం విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రతిపాదనను తీవ్రంగా ప్రతిఘటించాల్సిన అవసరం ఉందని షర్మిల తన లేఖలో పేర్కొన్నారు.

## తెదేపా కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన నారా భువనేశ్వరి



ప్రత్తిపాడు: 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో తెదేపా అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పర్యటిస్తున్నారు. చంద్రబాబు అరెస్ట్‌తో మనస్తాపానికి గురై మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలను ఆమె పరామర్శించారు. నియోజకవర్గ పరిధిలోని బుడంపాడులో మైలా శివయ్యయాదవ్, అనంతవరప్పాడులో కోటేశ్వరరావు కుటుంబాలను ఓదార్చారు. ఒక్కో కుటుంబానికి రూ.3లక్షల చొప్పున ఆర్థికసాయం చెక్కులను అందజేశారు. ఆయా కుటుంబాలకు తెదేపా అండగా ఉంటుందని భువనేశ్వరి భరోసా ఇచ్చారు.




## ఏపీ సీఎం జగన్‌ను ఏకిపారేసిన గోనె ప్రకాష్ రావు

హైదరాబాద్/అమరావతి, ఫిబ్రవరి 7: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్ రావు విమర్శలు గుప్పించారు. జగన్ పిరికిపంద అంటూ వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వలన జగన్ మునిగిపోతున్నారని సంచలన కామెంట్స్ చేశారు. షర్మిలపై చెత్త ప్రచారం ఆపకుంటే జగన్ చరిత్ర హీనుడిగా మిగిలిపోతాడని హెచ్చరించారు. సజ్జల లాంటి దరిద్రుడి సలహాలతో జగన్‌కు తీవ్ర నష్టం జరగబోతోందన్నారు.

టీడీపీ, జనసేన కూటమికి ఏపీలో 151 సీట్లు దాటినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. ఏపీలో జగన్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కదన్నారు. ఎన్నికల తర్వాత జగన్ శాసనసభకు కూడా రాడంటూ షాకింగ్ కామెంట్స్ చేశారు.

**ఆ దేవుడు కూడా క్షమించడు...** బీజేపీతో పొత్తు వలన.. టీడీపీ, జనసేన కూటమికి బలం పెరుగుతోందన్నారు. చంద్రబాబు (%ుణూ జప్త్రఅవట జప్త్రుఅనతీుఘ్షుఎబ%) చరిత్ర తెలియకుండా జగన్ మట్లాడటం సరైంది కాదన్నారు. 1978లో చంద్రబాబు ఎమ్మెల్యే అయినప్పుడు.. జగన్ డైపర్లు వేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మంత్రులు రోజా, విడదల రజనీకి కూడా జగన్ టికెట్ ఇవ్వరన్నారు. కొత్త ఇంచార్జ్‌ల్లో 35 మంది వరకు జగన్ బీఫాం ఇవ్వరన్నారు. తల్లి, చెల్లి పట్ల జగన్ వ్యవహరిస్తోన్న తీరును.. దేవుడు కూడా క్షమించడన్నారు.

**తండ్రిని చంపిన వారితోనే....** 2019 ఎన్నికల్లో కూడా హైదరాబాద్ నుంచే జగన్ ప్రచారం చేశారన్నారు. ఎన్ఆర్ఐ అర్థం ఏంటో కూడా జగన్‌కు తెలియదన్నారు. హత్యలు కాదు.. రాజకీయాల్లో ఆత్మహత్యలే ఉంటాయనటానికి జగనే ఉదాహరణ అన్నారు. ఏపీలో వైసీపీ చిత్తుగా ఓడిపోతుందని అన్ని సర్వేలు చెబుతున్నాయన్నారు. షర్మిల వలన కాదు.. జగన్‌ను నమ్ముకున్న తెలంగాణ నేతలు రోడ్డున పడ్డారన్నారు. జగన్‌ను నమ్ముకున్న కొండా సురేఖ రాజకీయంగా నష్టపోయిందని తెలిపారు. జగన్‌ను వదిలేయటం వలనే ఇంద్రకరణ్ రెడ్డి, కోనేరు కోనప్ప, పువ్వాడ అజయ్, పుట్ట మధు, బాజిరెడ్డి, సంజీవరావులు రాజకీయంగా కుదురుకున్నారన్నారు. సోనియా గాంధీ కాళ్ళు పట్టుకుని జైలు నుంచి జగన్ బయటకు వచ్చారన్నారు. రిలయన్స్‌పై దాడులు చేసి అదే రిలయన్స్ వ్యక్తి పరిమళ్‌కు రాజ్యసభ ఇచ్చారన్నారు. తండ్రిని చంపించిన వారితో జగన్ డబ్బుల కోసం ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపించారు. స్వార్థం కోసం దగ్గర బంధువు సునీల్ ఎవరో తెలియదన్న వ్యక్తి జగన్ అంటూ గోనె ప్రకాష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

## ప్రభుత్వానికి జే ట్యాక్స్ కడితేనే ధాన్యం దిగుమతి అయ్యే పరిస్థితి

అమరావతి: రైతాంగ సమస్యలపై శాసన మండలిలో తాము చర్చకు పట్టుబడితే.. మండలి చైర్మన్ సభను వాయిదా వేశారని తెలుగుదేశం ఎమ్మెల్సీలు బీటీ నాయుడు, దువ్వారపు రామారావు మండిపడ్డారు. నేడు వారిద్దరూ మీడియాతో మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లు కూడా చేయలేని అసమర్థ ప్రభుత్వం వైసీపీదేనని అన్నారు. తెలంగాణలో 1.31 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందన్నారు. అన్నపూర్ణ అని పిలిచే ఏపీలో తెలంగాణలో కొనుగోలు చేసిన ధాన్యంలో సగం కూడా లేదని టీడీపీ ఎమ్మెల్సీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో 49.54 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు జరిగిందన్నారు. ప్రభుత్వానికి జే ట్యాక్స్ కడితేనే ధాన్యం దిగుమతి అయ్యే పరిస్థితి నెలకొందని టీడీపీ ఎమ్మెల్సీలు పేర్కొన్నారు. మిల్లుల వద్దే అన్నపానీయాలు లేకుండా రైతులు వేచి చూసే పరిస్థితి ఉందన్నారు. రైతు భరోసా కేంద్రాలు కాదు... రైతు భక్షక కేంద్రాలుగా మారాయన్నారు. ఇటీవల 10 ప్రకృతి విపత్తుల్లో 80 లక్షల ఎకరాల పంట నష్టం జరిగిందన్నారు. దీంతో రైతులు రూ.30 వేల కోట్లు నష్టపోయారన్నారు. సహకార సంఘ డెయిరీల అభివృద్ధి మానేసి గుజరాత్ కంపెనీలను తీసుకొచ్చారని టీడీపీ ఎమ్మెల్సీలు పేర్కొన్నారు.

## ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు కేబినెట్ ఆమోదం



అమరావతి: సచివాలయంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రిమండలి సమావేశమైంది. ఈ మంత్రిమండలి సమావేశంలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను మంత్రి మండలి ఆమోదించింది. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో 05-02-2024 నాడు ఉభయసభలనుద్దేశించి ప్రసంగించిన... గవర్నర్ ప్రసంగానికి ఆమోదం తెలిపిన మంత్రిమండలి. నంద్యాల జిల్లా డోన్‌లో కొత్తగా హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలిటెక్నిక్ కాలేజ్ ఏర్పాటుకు ఆమోదం తెలిపిన మంత్రిమండలి. డాక్టర్ వైయస్ఆర్ హార్టికల్చర్ యూనివర్శిటీ పరిధిలో పనిచేయనున్న హార్టికల్చరల్ పాలిటెక్నికల్ కళాశాల. నంద్యాల జిల్లా డోన్‌లో వ్యవసాయరంగంలో రెండేళ్ల డిప్లొమా కోర్సుతో వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటుకు ఆమోదం తెలిపిన మంత్రిమండలి. ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చర్ యూనివర్శిటీ పరిధిలో పనిచేయనున్న అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ యూనివర్శిటీస్ (ఎస్టాబ్లిష్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్ 2016కు సవరణలు చేయడం ద్వారా బ్రౌన్‌ఫీల్డ్ కేటగిరిలో మూడు ప్రైవేట్ యూనివర్శిటీలకు అనుమతి. అన్నమయ్య జిల్లా రాజంపేటలో అన్నమాచార్య యూనివర్శిటీ, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ, కాకినాడ జిల్లా సూరంపాలెంలో ఆదిత్య యూనివర్శిటీల ఏర్పాటుకు ఆమోదం తెలిపిన మంత్రిమండలి.






విజయవాడ : ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల అయ్యింది. మొత్తం 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను బుధవారం మధ్యాహ్నం విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సచివాలం నుంచి విడుదల చేశారు. ఈ నెల 12వ తేదీ నుంచి ప్రక్రియ ప్రారంభం అవుతుందని.. ఏప్రిల్ 7వ తేదీన ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారాయన. ఏపీ డీఎస్సీ నోటిఫికేషన్ వివరాల్ని మంత్రి బొత్స మీడియాకు వివరించారు. రాష్ట్రంలో 2024 డీఎస్సీని ప్రకటిస్తున్నాం. ఏడు మేనేజ్ మెంట్ల పరిధిలో 6100 పోస్టులతో డీఎస్సీని ప్రకటిస్తున్నాం. మెగా డీఎస్సీలో.. మొత్తం పోస్టుల్లో 2,299 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 2,280 ఎస్‌జీటీ పోస్టులు, 1,264 టీజీటీ పోస్టులు, 215 పీజీటీ పోస్టులు ఉన్నాయి. ఈ నెల 12వ తేదీ నుంచి డీఎస్సీ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఏప్రిల్ 7వ తేదీతో ముగుస్తుంది. విద్య మా ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత. మా ప్రభుత్వం ఈ అయిదేళ్లలో రూ.73 వేల కోట్లు విద్య పై ఖర్చు చేసింది అని మీడియాకు మంత్రి బొత్స తెలిపారు.

**డీఎస్సీ ప్రక్రియ ఇలా..** ఈ నెల 12వ తేదీ నోటిఫికేషన్ రిలీజ్‌తో డీఎస్సీ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఆన్‌లైన్‌లో 12వ తేదీ నుంచి 22వ తేదీ మధ్య https://cse.ap.gov.in/loginhome లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. 24వ తేదీన ఆన్‌లైన్ మాక్ టెస్ట్ రాసేందుకు అభ్యర్థులకు వీలు కల్పిస్తారు. మార్చి 5వ తేదీ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మార్చి 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రెండు సెషన్స్‌లో డీఎస్సీ పరీక్షలు ఉంటాయి. మార్చి 31వ తేదీన ప్రాథమిక కీ విడుదల అవుతుందని.. ఏప్రిల్ 1వ తేదీన కీలో అభ్యంతరాలపై స్వీకరణ ఉంటుందని.. ఆ వెంటనే ఏప్రిల్ 2వ తేదీన ఫైనల్ కీ విడుదల చేస్తామని చెప్పారాయన. ఏప్రిల్ 7వ తేదీన డీఎస్సీ ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు.




కడప: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సమీపిస్తున్న వేళ అధికార వైస్సార్‌సీపీకి వరుసగా దెబ్బలు తగులుతున్నాయి. తాజాగా మరో 'బిగ్ స్ట్రోక్' తగలబోతోంది.

నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి వైసీపీకి గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకున్నారని తెలుస్తోంది. టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ మేరకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌తో భేటీ అయ్యారు.

**జమ్మలమడుగు వైసీపీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై టీడీపీ నేత దేవగుడి నారాయణ రెడ్డి ఫైర్ :** ఏపీ అసెంబ్లీ ఎన్నికల సమీపిస్తున్న వేళ రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శల వేడి పెరిగింది. జమ్మలమడుగు వైసీపీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ నేత దేవగుడి నారాయణ రెడ్డి మండిపడ్డారు.

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి డబ్బు సంచులతో నాయకులు చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు. భూపేష్ రెడ్డి నాయకత్వంలో జమ్మలమడుగులో టీడీపీ విజయం వైపు అడుగులు వేస్తోందని దీమా వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ భూబాధితులకు వైసీపీ ప్రభుత్వం న్యాయం చేయలేకపోయిందని పేర్కొన్నారు. జమ్మలమడుగు వైసీపీ నేతలు టీడీపీలో చేరడానికి సిద్ధమయ్యారని చెప్పారు.

## స్పీకర్ అసహనానికి ఆ కథనమే కారణం కావొచ్చు..

అమరావతి: ఇవాళ ఉదయం నుంచి ఏపీ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అసహనంగా కనిపించారని తెలుగుదేశం పార్టీ శాసనసభ పక్ష ఉపనేత నిమ్మల రామానాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి, అతని భార్య అవినీతి పై ఓ ప్రధాన పత్రికలో వచ్చిన కథనం ఆయనలో అసహనం పెంచినట్లు ఉందన్నారు. ఇవాళ బడ్జెట్ ఉన్నా, మమ్మల్ని త్వరగా సస్పెండ్ చేయటానికి కారణం కూడా అదే కావొచ్చని రామానాయుడు అన్నారు. పత్రికలో కథనం చదివాక స్పీకర్ ముఖ కవళికల్లో మార్పు ఉందని అసెంబ్లీలో అంతా చెప్పుకుంటున్నారన్నారు. ఆ అసహనంతోనే రైతుల గోడు వినేందుకు కూడా స్పీకర్ ఇష్టపడలేదన్నారు. రైతు సమస్యలు ఎక్కడ వినాల్సి వస్తుందనే భయంతోనే తామిచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించారని నిమ్మల పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని ఓ కీలక నియోజకవర్గ ప్రముఖ ప్రజాప్రతినిధిపై ఓ ప్రముఖ మీడియా సంస్థ సంచలన వార్తను వెలువరించింది. సుదీర్ఘ విరామం తర్వాత వైసీపీ తరఫున గెలిచిన సదరు పెద్ద మనిషి తన పదవిని అడ్డం పెట్టుకుని దోపిడీకి తెరలేపారట. ఇక ఆయన దందాకు ఆయన సతీమణి కూడా తోడయ్యారట. మరోవైపు వారి కుమారుడు సైతం చేరిపోయి దోపిడీ దొంగల మాదిరిగా నియోజకవర్గంపై పడి దోచుకుంటున్నారని సదరు కథనం సారాంశం. వీళ్ల భూదందాలు, సెటిల్‌మెంట్లకు హద్దే లేదని.. ఇసుక నుంచి మద్యం వరకూ అన్నింటా వీరి హస్తముందని కథనంలో పేర్కొన్నారు. వీరి దోపిడీ పర్వం గురించి అక్కడ ఎవర్ని కదిపినా కథలు కథలుగా చెబుతారని తెలిపారు. ఈ కథనమే స్పీకర్‌లో అసహనాన్ని రేకెత్తించిందని నిమ్మల పేర్కొన్నారు.

## 'పెడన' టికెట్ కృష్ణ ప్రసాద్ కే.. బాబుతో భేటీ తర్వాత మారిన సీన్!

అమరావతి, ఫిబ్రవరి 7: ఏపీలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికారంలోకి రావడమే లక్ష్యంగా టీడీపీ – జనసేన కూటమి కార్యాచరణను రూపొందిస్తోంది. అయితే టికెట్‌ల విషయంలో మాత్రం ఇరు పార్టీల అభ్యర్థుల్లో కాస్త భయం కనపడుతున్నట్లు సమాచారం. పొత్తులో భాగంగా రెండు పార్టీల్లో ఏ పార్టీ అభ్యర్థికి టికెట్ దక్కుతుందో అనే టెన్షన్ ప్రతీఒక్కరిలో ఉంది. సీట్ల సర్దుబాటుపై ఇరు పార్టీల అధినేతలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే ఉత్కంఠ టీడీపీ – జనసేన పార్టీ నేతల్లో నెలకొంది.

**టికెట్‌పై హామీ! :** ఇలాంటి పరిస్థితినే ప్రస్తుతం పెడన టీడీపీ ఇంచార్జ్ కాగిత కృష్ణ ప్రసాద్ ఎదుర్కొంటున్నారు. పొత్తులో భాగంగా పెడన జనసేనకు పోతుందనే అనుమానం టీడీపీ నేతలను టెన్షన్‌కు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బుధవారం హుటాహుటిన ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి చేరుకున్న కాగిత కృష్ణప్రసాద్... అధినేతతో భేటీ అయ్యారు. కృష్ణ ప్రసాద్ అనుచరులు సైతం చంద్రబాబు నివాసం వద్దకు చేరుకున్నారు. అయితే చంద్రబాబుతో భేటీ అనంతరం తన అనుచరులతో కాగిత కృష్ణ ప్రసాద్ కలిశారు. టికెట్‌పై చంద్రబాబు హామీ ఇచ్చారని, జాగ్రత్తగా పని చేసుకోవాలని సూచించారని అనుచరులకు కృష్ణ ప్రసాద్ తెలిపారు.

**అనుచరుల ఆనందం..** కాగా.. ఇటీవల టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రెండు సార్లు భేటీ అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పెడన టికెట్ తనకే ఇవ్వాలని పవన్ పట్టుబట్టినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే చంద్రబాబుతో కృష్ణప్రసాద్ భేటీ అవగా.. పెడన టికెట్‌పై హామీ ఇచ్చారని కృష్ణప్రసాద్ అనుచరులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# మిస మిస మెరుపుల మెహబూబా

మిస మిస మెరుపులతో మతులు చెడగొట్టడంలో దిశా పటానీ తర్వాతే. నిరంతరం సోషల్ మీడియాల్లో ఈ బ్యూటీ షేర్ చేసే ఫోటోలు, వీడియోలకు యూత్ కి మైండ్ బ్లాక్ అయిపోతోంది. తాజాగా దిశా షేర్ చేసిన ఓ ఫోటోషూట్ ఒక్కసారిగా అగ్గి రాజేసింది. ఎరుపు రంగు మెరుపులు మిరుమిట్ల ఛమ్కీ దుస్తుల్లో దిశా స్టన్నర్ గా కనిపించింది. దిశా ఈ అందమైన డిజైనర్ దుస్తుల్లో స్టైలిష్ గా క్యాట్ వాక్ చేస్తూ కనిపించింది. ఇక ఎంపిక చేసుకున్న ఔట్ ఫిట్ లో దిశా అందాల మిలమిలలకు మతులు చెడిపోయాయ్ అంటే నమ్మండి. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్స్ వీడియోని సోషల్ మీడియాల్లో వైరల్ గా



షేర్ చేస్తోంది యూత్. దీనికి అద్భుతమైన క్లిక్ లు వ్యూస్ దక్కుతున్నాయి. దిశా పటానీకి ఇన్ స్టా వేదికగా లక్షల్లో ఫాలోవర్స్ ఉన్నారు. వీరందరికీ ఇది స్పెషల్ విజువల్ ఫెస్ట్ అని చెప్పాలి. త్వరలోనే ప్రభాస్ నటిస్తున్న కల్కి చిత్రంలో దిశా పటానీని తెలుగు ప్రేక్షకులు వీక్షించబోతున్నారు. లోఫర్ తర్వాత చాలా కాలానికి దిశా భారీ పాన్ ఇండియా సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. తనకు నిరూపించుకునేందుకు ఇది మంచి అవకాశం. ఏం చేస్తుందో వేచి చూడాలి. అటు బాలీవుడ్ లో దిశా పటానీ తదుపరి భారీ యాక్షన్ డ్రామా యోధాలో కనిపించనుంది. సిద్ధార్థ్ మల్హోత్రా, రాశి ఖన్నాతో కలిసి నటించింది. అంతే కాకుండా ఇమ్రాన్ హష్మీ నటించిన షోటైమ్ అనే వెబ్ సిరీస్‌లో కనిపించనుంది.

# అన్నయ్యా అంటే ముఖం పుల్లగా పెట్టిన రవితేజ!

సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్లు హీరోలని..డైరెక్టర్లని... ముఖ్యమైన సిబ్బందిని అన్నయ్య అని పిలవడం అన్నది ఎక్కడా జరగదు. అసలు అన్నయ్య అనే పదమే ఇండస్ట్రీలో హీరోయిన్ నోట రాకూడదు. ఇది ఓ కండీషన్ లా పనిచేస్తుంది. హీరోయిన్లు అందరికీ ఇదొక రూల్ లాంటిది. హీరోయిన్లు కూడా అలాంటి వర్డింగ్ ఎవరి విషయంలోనూ వినియోగించరు. మనసులో సోదర భావం ఉన్నా ..బయటకు మాత్రం దాన్ని ప్రొజెక్ట్ చేయరు. అయితే తెలిసో తెలియకో? అనుపమ పరమేశ్వరన్ దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని అన్నయ్య అనేయడం పై రవితేజ పెద్ద రచ్చే చేసాడని ఈ వీడియో చూస్తే తెలుస్తుంది. ప్రస్తుతం ఈ కాంబినేషన్ లో ఈగల్ అనే చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా ప్రమోషన్ లో భాగంగా గ్యాంగ్ అంతా ఒకేచోట చేరారు. రవితేజ..అనుపమ..



నవదీప్..అవసరాల శ్రీనివాస్ పాల్గొన్నారు. మాటల మధ్యలో అనుపమ దర్శకుడు కార్తీక్ ని అన్నయ్య అని సంబోంధించింది. దీంతో ఆమె పక్కనే ఉన్న రవితేజ నువ్వు కార్తీక్ ని అన్నయ్యా? అని పిలుస్తావా? అంటూ ముఖం పుల్లగా పెట్టి మూతి బిగించాడు. అందమైన అమ్మాయిలు అన్నయ్య అనే వర్డ్ వాడకూదమ్మా? నేను ఎందుకు చెప్పానో అర్దం చేసుకో అన్నాడు. ఆ తర్వాత అనుపమతో కార్తీక్ అని ప్రేమగా పిలిపించాడు. కార్తీక్ తో నాలుగు సినిమాలకు పనిచేసిన అనుభవంతో అనుపమ అన్నయ్య అనే చనువు తీసుకున్నాను అన్నా? సరే రవితేజ మాత్రం ఒప్పుకోలేదు. ఇంకా నయం అదే రవితేజని..అనుపమ అన్నయ్యా? అని పిలిస్తే ఆయనెంత ఫీలైపోయేవాడో? ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఈగల చిత్రం ఫిబ్రవరి 9న భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతు న్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కించాడు.




# న్యూజిలాండ్ వెళుతున్న కన్నప్ప




విష్ణు మంచు ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తు న్నారు. ఇంతకుముందే కన్నప్ప మొదటి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఒక నాస్తిక యోధుడు శివుని పరమ భక్తుడిగా మారడానికి చేసిన ప్రయాణం ఎలాంటిదో తెరపై చూపిస్తున్నాం! అంటూ మేకర్స్ ఆసక్తిని రేకెత్తించారు. విష్ణు అభిమానులు, నెటిజనులు పోస్టర్‌ను ప్రశంసిం చారు. కన్నప్ప చిత్రంలో ప్రభాస్, మోహన్ లాల్, శివ రాజ్ కుమార్, మధు, నయనతార, మోహన్ బాబు, జోసితా అనోలా రోడ్రిగ్స్ వంటి ప్రముఖ తారలు నటిస్తున్నారు. తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ, తమిళ భాషల్లో సినిమా థియేటర్లలో విడుదల కానుంది. AVA ఎంటర్ టైన్‌మెంట్ – ట్వంటీ ఫోర్ ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఇటీవలే మొదటి షెడ్యూల్ పూర్తయింది. వచ్చే వారంలో న్యూజిలాండ్ వెళ్లి కీలక షెడ్యూల్ షూటింగును పూర్తి చేయాలనేది ప్లాన్. దసరా కానుకగా 2024 అక్టోబర్ 10న విడుదల చేయనున్నారని కూడా తెలుస్తోంది. అంటే దసరా (11 అక్టోబర్)కి ఒక రోజు ముందు రిలీజ్ చేయనున్నారు. ఈ సీజన్ లో దసరా సెలవులను ఎన్ క్యాష్ చేయాలనేది ప్లాన్. ఇది భారీ బడ్జెట్ చిత్రం. సెట్స్ నుంచి సమాచారం మేరకు.. సినిమా చాలా బాగా వస్తోందని టాక్. పలు ఇండస్ట్రీలకు చెందిన సూపర్ స్టార్లు ఇందులో కీలక పత్రలో పోషిస్తుండడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇటీవలి కాలంలో టాలీవుడ్ లో తెరకెక్కుతున్న సైలెంట్ పాన్ ఇండియా చిత్రంగా కన్నప్ప గురించి చెప్పవచ్చు. ఈ చిత్రానికి మణి శర్మ, స్టీఫెన్ దేవస్సే సంగీతం అందిస్తున్నారు.

**కన్నప్పపై గత సినిమాలు:** శివునికి భక్తుడిగా మారిన నాస్తిక వేటగాడు కన్నప్ప జానపద కథకు తెలుగు ప్రజల్లో గొప్ప ప్రాముఖ్యత ఉంది. శివునిపై అపారమైన భక్తి కలిగి ఉన్న కన్నప్ప ఒకానొక సమయంలో తన కన్నును పొడిచి శివునికి నైవేథ్యంగా సమర్పిస్తాడు. ఇందులో భక్తి పరంగా ఎంతో డెప్త్ ఎమోషన్ ఉంటుంది. ఈ కథ గతంలో కన్నడ, తెలుగు ఇండస్ట్రీల్లో కూడా తెరకెక్కింది. దీనికి 1954లో బెదర కన్నప్ప , కాళహస్తి మహత్యం పేరుతో తెరకెక్కించారు. ఈ రెండిటిలో రాజ్‌కుమార్ నటించారు. ఇది హిందీలో శివభక్త (1955)గా తెరకెక్కింది. ఇందులో షాహూ మోదక్ నటించారు. ఇదే కథను తెలుగులో కృష్ణంరాజు ప్రధాన పాత్రలో 'భక్త కన్నప్ప' (1976)గా తెరకెక్కించగా సంచలన విజయం సాధించింది. కృష్ణంరాజుకు గొప్ప పేరును తెచ్చిన చిత్రమిది. ఇది రాజ్‌కుమార్, శివ రాజ్‌కుమార్, పునీత్ రాజ్‌కుమార్ నటించిన 'శివ మెచ్చిద కన్నప్ప' (1988)గా మళ్లీ కన్నడలో తెరకెక్కడం విశేషం.

# పరీక్షల కాలంలో.. వరుణ్ తేజ్ ఆపరేషన్




మెగా హీరో వరుణ్ తేజ్ బాక్స్ ఆఫీస్ వద్ద సాలిడ్ సక్సెస్ అందుకొని చాలా కాలం అయింది. అప్పుడెప్పుడో వచ్చిన ఫిదా తొలిప్రేమ సినిమాలతోనే అతనికి మార్కెట్లో మంచి డిమాండ్ అయితే ఏర్పడింది. ఇక తర్వాత చేసిన ఏ సినిమా కూడా భారీ స్థాయిలో అయితే సక్సెస్ కాలేదు. మధ్యలో వచ్చిన గద్దలకొండ గణేష్ పరవాలేదు అనే విధంగా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్స్ అందుకుంది. ఇక తర్వాత ఎఫ్3 కూడా పూర్తి స్థాయిలో సక్సెస్ కాలేదు. అయినప్పటికీ అది మల్టీస్టారర్ సినిమా. ఇక సోలో సక్సెస్ కోసం వరుణ్ తేజ్ చాలా కాలంగానే ఎదురు చూస్తూ ఉన్నాడు. కదల స్టైల్ మారుతున్నా కూడా బాక్సాఫీస్ వద్ద ఊహించని విధంగా డిజాస్టర్స్ ఎదురవుతున్నాయి. గని గాండీవ దారి అర్జున రెండు సినిమాలు కూడా దారుణంగా నష్టాలను కలిగించాయి. అయితే నెక్స్ట్ సినిమాతో మాత్రం సాలిడ్ సక్సెస్ అందుకోవాలి అనే విధంగా వరుణ్ తేజ్ ఆలోచిస్తున్నాడు. అతని నుంచి నెక్స్ట్ రాబోతున్న సినిమా ఆపరేషన్ వాలెంటైన్స్. తెలుగు హిందీలో ఒకేసారి ఈ సినిమాను విడుదల చేయబోతున్నారు. ఇప్పటివరకు అయితే అనుకున్నంత స్థాయిలో అంచనాలు క్రియేట్ కాలేదు. ప్రమోషన్స్ కంటెంట్ కూడా పెద్దగా క్రేజ్ పెంచడం లేదు. అసలైతే ఈ సినిమాను ఫిబ్రవరిలో విడుదల చేయాలని అనుకున్నారు. కానీ మళ్ళీ ఎందుకో వెనక్కి తగ్గారు. ఇక ఇప్పుడు మార్చి ఒకటవ తేదీన పెద్దగా పోటీ లేకుండా రంగంలోకి దిగుతున్నారు. ఇది సోలో డేట్ అయినప్పటికీ కూడా ఆడియోన్స్ ను థియేటర్స్ కు రప్పించడం చాలా కష్టమైన పని. టీనేజ్ తో పాటు యువత ఎగ్జామ్స్ తో చాలా బిజీగా ఉంటారు. ఇక ఫ్యామిలీ ఆడియన్స్ అంతగా ఆసక్తి చూపించకపోవచ్చు. కాబట్టి ఇది సినిమాకు పెద్ద పరీక్ష అని చెప్పవచ్చు. ఈ టైంలో సక్సెస్ అందుకోవడం సాధారణమైన విషయం కాదు. కాబట్టి టాక్ మాత్రం చాలా బలంగా పాజిటివ్ గా ఉండాలి. ఇటీవల ఇదే బ్యాక్ డ్రాప్ లో వచ్చిన బాలీవుడ్ ఫైటర్ మూవీ దారుణంగా డిజాస్టర్ అయింది. రెండో రోజుకే సినిమా కలెక్షన్స్ దారుణంగా తగ్గిపోయాయి. ఇక ఇప్పుడు అదే టచ్ తో రాబోతున్న వరుణ్ తేజ్ ఆపరేషన్ వాలెంటైన్ ఎలాంటి సక్సెస్ అందుకుంటుందో చూడాలి.

# అరియానా స్టన్నింగ్ లుక్స్.. చేతిలో ఏంటది?

బిగ్ బాస్ బ్యూటీ అరియానా గ్లోరీ గురించి అందరికీ తెలిసిందే. ఆర్జీవీ ఇంటర్వ్యూతో పాపులారిటీ దక్కించుకున్న ఈ బ్యూటీ.. బిగ్ బాస్ సీజన్ 4 తో ప్రేక్షకులను మరింత ఆకట్టుకుంది. అరియనా ఒక దశలో టైటిల్ ఫేవరేట్ గా ప్రచారమైంది. ముక్కుసూటిగా గేమ్ ఆడి అభిమానులను సొంతం చేసుకుంది. బిగ్ బాస్ హౌస్ నుంచి బయటకొచ్చాక అరియానా క్రేజ్ ఓ రేటంజ్ లో పెరిగిపోయింది. అయితే నెట్టింట అరియానా చేసే రచ్చ అంతా ఇంతా కాదు. సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్ గా ఉంటూ.. ఎప్పటికప్పుడు తన న్యూ లుక్స్ తో ఆకట్టుకుంటోంది. స్టన్నింగ్ అవుట్ ఫిట్లలో ఫొటోషూట్లు చేస్తూ తన ఫాలోవర్స్ ను మరింతగా పెంచుకుంటోంది. బ్యాక్ టు బ్యాక్ గ్లామర్ ఫొటోలను పోస్ట్ చేస్తూ నెట్టింట సెగలు పుట్టిస్తోంది. కిర్రాక్ లుక్స్ తో కుర్రాళ్లను మంత్రముగ్ధులను చేస్తోంది. కొన్నాళ్లుగా అరియానా గ్లోరీ గ్లామర్ డోస్ పెంచింది. బికినీలు, పొట్టి డ్రెస్సుల్లో



స్టన్నింగ్ పోజులు ఇస్తూ కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తుంది. తాజాగా డ్రింక్ గ్లాస్ పట్టుకుని దర్శనమిచ్చింది. జీన్స్, షార్ట్ టాప్ ధరించి చిల్ బ్రో అంటూ క్యాప్షన్ ఇచ్చింది. నడుము, నాభి అందాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అరియనా గ్లామర్ కు కుర్రకారు ఫిదా అవుతున్నారు. అరియానా కొత్త ఫొటోలపై లైకుల వర్షం కురిపిస్తూ ఫ్యాన్స్ వైరల్ చేస్తున్నారు. అమ్మడి గ్లామర్ ఫీస్ట్ కు కామెంట్లతో పొగుడుతూ ఆకాశానికి ఎత్తుతున్నారు. యంగ్ బ్యూటీని ఎంకరేజ్ చేస్తున్నారు. ముద్దుగుమ్మ అందం చూపు తిప్పుకోనివ్వడం లేదని కామెంట్లు పెడుతున్నారు. బిగ్ బాస్ తో క్రేజ్ సంపాదించుకున్న అరియానా.. ఆ తర్వాత కొంతకాలం పాటు మూవీ ఇంటర్వ్యూలను చేసింది. బిగ్ బాస్ బజ్ షో కూడా తానే యాంకర్ గా వ్యవహరించింది. కొన్నాళ్ల నుంచి బుల్లితెరపై పలు షోలకు యాంకర్ గా చేస్తోంది.ప్రస్తుతం అరియానాకు ఇన్ స్టాగ్రామ్‌లో 1 మిలియన్ కు పైగా ఫాలోవర్స్ ఉన్నారు.

# మంచులక్ష్మి ఆదిపర్వం.. మరో గ్రాఫిక్స్ కథ

మంచు లక్ష్మి నటిగా టాలీవుడ్ లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. అనగనగా ఒక ధీరుడు సినిమాతో మంచు లక్ష్మి విలనీగా తెరంగేట్రం చేసింది. తరువాత సెలక్టివ్ గా సినిమాలు చేస్తూ వెళ్తోంది. ఫీమేల్ సెంట్రిక్ కథలకి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. ప్రస్తుతం ఆదిపర్వం అనే సినిమాలో మంచులక్ష్మి నటిస్తోంది. ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది. భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా రేంజ్ లో ఈ సినిమా తెరకెక్కుతోంది. విజువల్ ఎఫెక్ట్స్ బేస్ చేసుకొని ఈ మూవీ కథ ఉంటుందంట. అన్వికా ఆర్ట్స్ మరియు ఎ. వన్ ఎంటర్టైన్మెంట్స్ సంయుక్త నిర్మాణంలో సిద్ధం అవుతోన్న ఈ సినిమాకి సంజీవ్ మేగోటి దర్శకత్వం వహిస్తున్నారు. ఏకంగా ఐదు ఇండియన్ భాషలలో ఈ మూవీ సిద్ధం అవుతోంది. 1974 నుంచి 1992 నేపథ్యంలో పీరియాడికల్ జోనర్ లో ఈ కథ నడుస్తుందంట. నాగులపురం నాగమ్మ పాత్రలో ఆమె కనిపించనుంది. అనగనగా ఒక ధీరుడు సినిమా తర్వాత ఆ స్థాయిలో గ్రాఫిక్స్, విజువల్ ఎఫెక్ట్స్ తో ఆదిపర్వం మూవీ ఉంటుందంట. ఇక ఈ సినిమాలో




మంచు లక్ష్మి ఎంత పవర్ ఫుల్ యాక్షన్ సీక్వెన్స్ ని చేసిందని ఎగ్జిక్యూటివ్ నిర్మాత గంటా శ్రీనివాసరావు తెలిపారు. గ్రాఫిక్స్ వర్క్ ప్రస్తుతం జరుగుతున్నాయని, త్వరలోనే మంచి డేట్ ని చూసుకొని మూవీని థియేటర్ లోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామని తెలిపారు. సినిమాలో క్షేత్ర పాలకుడు పాత్రలో శివ కంఠంనేని కనిపించనున్నారని తెలిపారు. ఇటీవల వచ్చిన హనుమాన్ తరహాలోనే ఆదిపర్వం మూవీ కూడా హై స్టాండర్డ్స్ లో ఉంటుందని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ సినిమాకి మాధవ్ సైబా – సంజీవ్ మేగోటి, బి. సుల్తాన్ వలి, ఓపెన్ బనానా, లుబెక్ లీ మార్విన్ సంగీతం అందిస్తున్నారు. మూవీలో ఆదిత్యం ఓం, ఎస్తర్ నొరోన్హా, శ్రీజిత్ ఘోష్, సత్యప్రకాష్, సమ్మెట గాంధీ లాంటి నటీనటులు కీలక పాత్రలలో కనిపించబోతున్నారు. మంచు లక్ష్మి చివరిగా తెలుగులో పిట్టకథలు మూవీలో నటించింది. అలాగే మలయాళంలో మోహన్ లాల్ మోనిస్టర్ సినిమాలో విలన్ గా నటించింది. మూవీలో మోహన్ లాల్ తో ఒక ఫైట్ సీక్వెన్స్ కూడా మంచు లక్ష్మికి ఉంది. మళ్ళీ అలాంటి పవర్ ఫుల్ యాక్షన్ సీక్వెన్స్ ఆదిపర్వం సినిమాలో ఉంటాయంట.



# రేవంత్ రెడ్డి ని కలిసిన దిల్ రాజు, అందుకోసమేనా...

తెలుగు ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు దిల్ రాజు తన కుటుంబంతో ఈరోజు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిశారు. దిల్ రాజు, అతని సోదరుడు శిరీష్, కుమార్తె, అల్లుడు, దిల్ రాజు సోదరుని కుమారుడు ఆశిష్ ఈరోజు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో వున్నారు.

అయితే ఇదేదో దిల్ రాజు పరిశ్రమ తరపున వెళ్లి కలిసింది కాదు, అతను వ్యక్తిగతంగా తన ఇంట్లో పెళ్లి వేడుకలకు ఆహ్వానించడానికి కలిశారు. దిల్ రాజు సోదరుని కుమారుడు ఆశిష్ వివాహం త్వరలో జరగబోతోంది, అందుకే ఇటు పరిశ్రమలోని, అటు రాజకీయ, వ్యాపార రంగంలో వున్నవారిని దిల్ రాజు కుటుంబంతో సహా వెళ్లి వ్యక్తిగతంగా అందరికీ శుభలేఖలు ఇచ్చి పెళ్ళికి ఆహ్వానిస్తున్నారు. ఇందులో భాగంగానే ఈరోజు ముఖ్యమంత్రిని కలిసి ఆశిష్ వివాహానికి ఆహ్వానించారని తెలిసింది. కొన్ని రోజుల క్రితం తెలంగాణా మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు ని కూడా కలిసి శుభలేఖ అందచేశారు. అంతకు ముందు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి ని కూడా కలిసి అహ్వాన పత్రిక అందచేశారు. ఇక పరిశ్రమలో ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్, నాగార్జున, వెంకటేష్ ఇలా అందరినీ వ్యక్తిగతంగా వెళ్లి కలిసి పెళ్ళికి పిలిచారు.

# రేషన్ కార్డు ఉంటేనే పథకాలు ఇస్తామని ఎన్నికల్లో ఎందుకు చెప్పలేదు?: బండి సంజయ్




కరీంనగర్: బీజేపీ ఎంపీ బండి సంజయ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల మెద్యాలు రాకముందే ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెల్ల రేషన్ కార్డు ఉంటేనే పథకాలు ఇస్తామని ఎన్నికల్లో ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే.. పథకాలు అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పథకాల అమలులో కొర్రీలు పెట్టకూడదన్నారు. గత ప్రభుత్వం దుర్మార్గాలు చేసిందని.. ప్రజలను మోసం చేసిందని..కాంగ్రెస్ గత ప్రభుత్వంలా చేయొద్దని బండి సంజయ్ సూచించారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత బాల్క సుమన్‌పై బండి సంజయ్ మండిపడ్డారు. భాష పట్ల నేతలు హద్దుల్లో ఉండాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు హద్దు మీరుతున్నారని, సీఎంను చెప్పుతో కొడతా అనడం తప్పని, ఇంతకంటే సిగ్గు చేటు ఉంటుందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అహంకారం బయట పడుతోందని, సీఎం కుర్చీకి గౌరవం ఇవ్వాలని, ముఖ్యమంత్రినే చెప్పుతో కొడతా అనడం కరెక్ట్ కాదని బండి సంజయ్ అన్నారు.

# ఆర్టీసీని నంబర్ 1 రవాణా సంస్థగా ఉంచే ప్రయత్నం: మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్: టీఎస్ ఆర్టీసీ ప్రజల సంస్థ అని, అందులో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా వివిధ రకాల ప్రమాదాల్లో మృతి చెందిన కుటుంబాలకు కారుణ్య నియామకాల కింద 800 మందికిపైగా నియామకాలు ఇవ్వడం జరుగుతుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం కొండాపూర్ ఎనిమిదో బెటాలియన్‌లో టీఎస్ ఆర్టీసీ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పెరేడ్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రి పొన్నం, ఆర్టీసీ ఎండీ వీ.సీ. సజ్జనార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇది నిరంతర ప్రక్రియ అని, అందులో భాగంగా ఈరోజు కొంతమంది కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆర్టీసీ సంస్థను తిరిగి తెలంగాణ ప్రజలకు నంబర్ 1 రవాణా సంస్థగా ఉంచే ప్రయత్నం జరుగుతోందన్నారు. గతంలో కరోనా, సమ్మె కారణంగా ఆర్టీసీకి పలు సమస్యలు ఏర్పడ్డాయని, వాటన్నిటిని అధిగమించడానికి ప్రభుత్వ సహకారం తీసుకుంటుందని మంత్రి పొన్నం అన్నారు. నూతనంగా మహాలక్ష్మి కార్యక్రమం ద్వారా ఉచితంగా మహిళలకు ప్రయాణం అందిస్తున్నామని, ఇప్పటి వరకు 14 న్నర కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారన్నారు. అక్యూపెన్సీ రేషియో బస్ స్టాండ్‌లు ఖాళీగా ఉన్న పరిస్థితి నుంచి బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణం చేస్తున్న సందర్భంలో నూతన బస్సుల కొనుగోలు, నూతన సిబ్బంది నియామకానికి ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కేబినెట్ సహకారంతో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మార్గదర్శకంలో ముందుకు వెళుతున్నామని, ప్రజలంతా సహకరించాలని కోరారు.

ఆర్టీసీ మనందరిదని దానిని కాపాడుకోవాలన్నారు. ఆర్టీసీని ముందుకు తీసుకుపోవడంలో అందరి సలహాలు కోరుతూ ఆర్టీసీ సంస్థను ప్రజలకు ఉపయోగపడే విధంగా మార్పులు చేర్పులు చేసే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# అంతర్జాతీయ విమానాశ్రయం తరహాలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి



హైదరాబాద్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బుధవారం పరిశీలించారు. రూ. 750 కోట్లతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి జరుగుతోంది. అంతర్జాతీయ విమానాశ్రయ తరహాలో రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మల్టీ లెవల్ పార్కింగ్, విశ్రాంతి గదులు, రూఫ్ టాప్ రైల్వే ట్రాప్ ప్లాట్ ఫారమ్స్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. చాలా తక్కువ సమయంలో వేగంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పనులు జరుగుతున్నాయన్నారు. ఎయిర్ పోర్ట్ తరహాలో కొత్త స్టేషన్ రూపుదిద్దుకుంటుందని, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా పనులు చేస్తున్నారన్నారు. 2025 నవంబర్ నాటికి పూర్తి అవుతుందన్నారు. చర్లపల్లి టెర్మినల్ పనులు శరవేగంగా సాగుతున్నాయని, అది కూడా త్వరలోనే పూర్తి అవుతుందన్నారు. చర్లపల్లి టెర్మినల్ ప్రారంభానికి ప్రధాని మోదీని ఆహ్వానిస్తామన్నారు. రీజినల్ రింగ్ రోడ్ పూర్తయితే ఆ ప్రాంతాల దగ్గర కొత్త రైల్వే స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇక్కడ 22 లిఫ్టులు 30కి పైగా ఎస్కలేటర్లు అందుబాటులోకి వస్తాయని, ప్రయాణికులు నేరుగా స్టేషన్‌లోకి రావడానికి బయటికి వెళ్ళడానికి గగనతలం నుండే ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం జరుగుతోందన్నారు.

# మేడారం జాతర.. ఆన్‌లైన్‌లోనూ మొక్కులు చెల్లించుకోవచ్చు!




హైదరాబాద్: మేడారం జాతరకు వెళ్లలేని భక్తులు సమ్మక్క సారలమ్మకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించే సదుపాయాన్ని దేవాదాయ శాఖ కల్పించింది. మీ సేవ, పోస్టాఫీసు, టీయాప్ ఫోలియో ద్వారా బుక్ చేసుకునే అవకాశం కల్పించింది. భక్తులు వారి బరువు ప్రకారం కిలోకు రూ.60 చొప్పున చెల్లించి నిలువెత్తు బంగారం సమర్పణ సేవను బుక్ చేసుకోవచ్చు. ఈ సేవలను బుధవారం మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. తపాలా శాఖ ద్వారా మేడారం ప్రసాదం సైతం పొందే అవకాశం కల్పిస్తున్నట్టు ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. కుంభమేళా తరువాత దేశంలో జరిగే అతి పెద్ద జాతర మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర. రెండేళ్లకోసారి మాఘమాసంలో నాలుగు రోజులపాటు కన్నుల పండుగ్గా జరిగే ఈ గిరిజనుల జాతరకు హాజరై, మొక్కులు చెల్లించుకుంటే సర్వ శుభాలూ కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఆసియాలోనే అతి పెద్ద జాతరగా గుర్తింపు పొందిన ఈ వేడుకను చూసి తరించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలే కాదు... ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు దాదాపు కోటిమంది వస్తారని అంచనా.

# ప్రస్తుతానికి రాజకీయాల్లోకి రావడం లేదు.. కానీ: విశాల్

చెన్నై: తాను రాజకీయపార్టీ స్థాపించనున్నట్టు ప్రచారమవుతోన్న వార్తలపై నటుడు విశాల్ స్పందించారు. అవి రూమర్స్ అని కొట్టిపారేశారు. ప్రస్తుతానికి రాజకీయాల్లోకి రావడంలేదన్నారు. కానీ, ప్రజా సేవ మాత్రం కొనసాగిస్తానని చెప్పారు. ఈ మేరకు తన ఎక్స్‌లో ఓ నోట్ విడుదల చేశారు. 'నటుడిగా, సమాజసేవకుడిగా నన్ను అభిమానిస్తున్న తమిళనాడు ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. ప్రజలకు సేవ చేయాలని, ఆపదలో ఉన్న వారికి చేయూతనివ్వాలనే లక్ష్యంతోనే నా ఫ్యాన్స్ క్లబ్‌ను నిర్వహిస్తున్నాం. దాన్ని 'విశాల్ మక్కల్ నల ఇయక్కం' (విశాల్ ప్రజా సంక్షేమ సంఘం)గా మార్చి జిల్లాల వారిగా, నియోజక వర్గాల వారిగా పనిచేయాలని నిర్ణయించుకున్నాం. మా అమ్మ పేరు మీద నెలకొల్పిన 'దేవి ఫౌండేషన్'తో ఎంతోమంది నిరుపేద విద్యార్థులకు, బాధిత రైతులకు సాయం చేస్తున్నాం. షూటింగ్‌లకు వెళ్లినప్పుడు అక్కడి ప్రజల కష్టాలు, అవసరాలను అడిగి తెలుసుకుని తగిన సాయం చేస్తూ, పరిష్కరిస్తూ వస్తున్నా. సంక్షేమ కార్యక్రమాల వల్ల రాజకీయ లబ్ధిని నేనెప్పుడూ ఆశించలేదు. భవిష్యత్తులో ప్రజల కోసం మాట్లాడేందుకు ఎప్పుడూ వెనకాడను' అని పేర్కొన్నారు. కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ 'తమిళగ వెట్రి కళగం' పేరుతో కొత్త పార్టీని ఏర్పాటు చేసి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. దీంతో విశాల్ కూడా రాజకీయరంగ ప్రవేశం చేయనున్నారని వార్తలు వైరలయ్యాయి. తాజా ప్రకటనతో వాటికి తెరపడింది. మరోవైపు విశాల్ తన సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. హరి దర్శకత్వంలో 'రత్నం'గా ప్రేక్షకుల్ని పలకరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవలే షూటింగ్ పూర్తయింది. కుటుంబ అంశాలతో నిండిన యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వేసవి సందర్భంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.




# 'సాయం చేయండి'.. జైశంకర్‌కు హైదరాబాద్ విద్యార్థి భార్య లేఖ

హైదరాబాద్: అమెరికాలో ఉన్నత విద్య కోసం వెళ్లిన హైదరాబాద్ విద్యార్థి సయ్యద్ మజాహిర్ అలీపై దాడి జరిగిన విషయం తెలిసిందే. మంగళవారం రాత్రి అతడు హోటల్ నుంచి ఇంటికెళ్తుండగా ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. తల, ముక్కు, కళ్లపై గాయాలయ్యాయి. రక్తంతో తడిసిన అతడు.. తనపై జరిగిన దాడిని వీడియో ద్వారా వెల్లడించాడు. తనకు సాయం చేయాలని భారత ప్రభుత్వాన్ని, అగ్రరాజ్యంలోని మన దౌత్య సిబ్బందిని అభ్యర్థించారు. దీంతో అతడి పరిస్థితిపై హైదరాబాద్‌లో ఉంటున్న కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తన భర్తకు సాయం చేయాలంటూ అలీ భార్య ఫాతిమా రిజ్వి కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌కు లేఖ రాశారు. "నా భర్తపై దాడి జరిగిందని అతడి స్నేహితుడొకరు ఫోన్ చేసి చెప్పారు. ఆయన భద్రతపై మాకు ఆందోళనగా ఉంది. దయచేసి ఆయనకు సరైన చికిత్స అందేలా చూడండి. వీలైతే నేనూ అమెరికా వెళ్లేందుకు అనుమతించండి" అని ఆమె కోరారు. అమెరికా చికాగోలోని భారత కాన్సులేట్ దీనిపై స్పందించింది. బాధిత విద్యార్థి మజాహిర్ అలీ, ఆయన భార్యతో తాము ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది.

వారికి అవసరమైన సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న స్థానిక అధికారుల నుంచి వివరాలు సేకరించినట్లు పేర్కొంది. నగరంలోని లంగర్‌హౌజ్ హాషీమ్‌నగర్‌కు చెందిన మజాహిర్ అలీ కొద్ది నెలల క్రితమే అమెరికా వెళ్లాడు. ఇండియానా వెస్లయన్ విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ చదువుతున్నారు. కాగా.. ఇటీవల అమెరికాలో వరుసగా భారతీయ విద్యార్థులపై దాడులు జరుగుతున్నాయి. హత్య, ఇతరత్రా కారణాలతో ఈ ఏడాది ఇప్పటివరకు నలుగురు ప్రాణాలు కోల్పోయారు.




దిల్లీ: దేశాన్ని విభజించేందుకు కాంగ్రెస్ పార్టీ అవాస్తవ కథనాలను సృష్టిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ దుయ్యబట్టారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో భాగంగా ప్రధాని రాజ్యసభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా హస్తం పార్టీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌వి కాలం చెల్లిన సిద్ధాంతాలని ఎద్దేవా చేశారు. "రాష్ట్రపతి ప్రసంగంపై కొందరు అభిప్రాయాలు చెప్పారు. మరికొందరు విమర్శించారు. గతంలో నా ప్రసంగాన్ని విపక్షాలు అడ్డుకున్నాయి. వారు నా మాటలు వినేందుకు సిద్ధంగా లేరని తెలుసు. విపక్షాల దుస్థితికి కాంగ్రెస్సే జవాబుదారీ. ఆ పార్టీవన్నీ పనికిరాని ఆలోచనలు. ఉత్తరం, దక్షిణం పేరుతో దేశాన్ని విడదీయాలని చూస్తున్నారు. మన దేశ భూభాగాల్లో చాలా వరకు కాంగ్రెస్ శత్రువులకు అప్పగించింది. మన సైన్యం ఆధునికీకరణను నిలిపివేసింది. అధికారం కోసం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది. ఎన్నికైన ప్రభుత్వాలను పడగొట్టింది. అలాంటి కాంగ్రెస్ జాతీయ భద్రత గురించి మాకు పాఠాలు చెబుతోంది" అని ప్రధాని మండిపడ్డారు.

**వారి నాయకులకే గ్యారంటీ లేదు కానీ..** "కాంగ్రెస్‌లో వారి నాయకులు, విధానాలకే ఎలాంటి గ్యారంటీ లేదు. అలాంటి వారు మోదీ గ్యారంటీలను ప్రశ్నిస్తున్నారు. దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాల వారికి కాంగ్రెస్ వ్యతిరేకంగా పనిచేసింది. మాజీ ప్రధాని నెహ్రూను వారు గుడ్డిగా అనుసరిస్తున్నారు. రిజర్వేషన్లను ఆయన గట్టిగా వ్యతిరేకించారు. మా హయాంలో ఎస్సీ, ఎస్టీలకు అన్ని పదవుల్లో విశేష ప్రాధాన్యం ఇచ్చాం. తొలిసారి ఆదివాసీ బిడ్డను రాష్ట్రపతిని చేసింది ఎన్డీయే ప్రభుత్వం. కాంగ్రెస్ పాలకులు వారి కుటుంబీకులకు మాత్రమే అత్యున్నత పురస్కారాలను అందించారు. 1990లో కేంద్రంలో మా మద్దతుతో ఉన్న ప్రభుత్వం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను 'భారతరత్న'తో సత్కరించింది" అని మోదీ గుర్తుచేశారు.

**ఖర్గేజీకి ఆ స్వేచ్ఛ ఎలా వచ్చిందో..** "ఇటీవల పశ్చిమ బెంగాల్ నుంచి కాంగ్రెస్‌కు ఓ సవాల్ (మమతా బెనర్జీ వ్యాఖ్యలను ఉద్దేశిస్తూ) ఎదురైంది. హస్తం పార్టీ 40 స్థానాలు కూడా సాధించలేదని అన్నారు. కనీసం మీరు 40 సీట్లైనా గెలవాలని నేను కోరుకుంటున్నా" అని ప్రధాని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా రాజ్యసభలో ఇటీవల ఖర్గే చేసిన ప్రసంగాన్ని కూడా ప్రస్తావించారు. "వచ్చే ఎన్నికల్లో మాకు 400 సీట్ల మెజార్టీ వస్తుందని ఖర్గే అంచనా వేశారు. అది మాకు ఆశీర్వాదంగా భావిస్తున్నా. కచ్చితంగా ఆయన అంచనా నిజమవుతుంది. ఆరోజు ఆయన సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఆయనకు అంత స్వేచ్ఛ ఎలా లభించిందని నేను ఆశ్చర్యపోయా. బహుశా ఆ రోజు వారి స్పెషల్ కమాండర్లు ఇద్దరు (కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్‌ను ఉద్దేశిస్తూ) ఆ రోజు సభకు రాలేదేమో" అని వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు.

**'స్టార్టప్' యువరాజ్.. ఏదీ స్టార్ట్ చేయడు :** అటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రధాని విమర్శల వర్షం కురిపించారు. "కాంగ్రెస్ పార్టీ పదే పదే ఒకే ఉత్పత్తి (రాహుల్‌ను ఉద్దేశిస్తూ)ని ఆవిష్కరించాలని ప్రయత్నిస్తోంది. అందుకే వారి దుకాణం మూతబడుతోంది. వారు తమ యువరాజును స్టార్టప్‌గా తీసుకురావాలని భావిస్తున్నారు. కానీ, ఆయన కనీసం దేన్నీ స్టార్ట్ చేయడు" అని ఎద్దేవా చేశారు.

# బీజేపీ, బీఆర్ఎస్ మధ్య అంతర్గత ఒప్పందాలు: ఎంపీ వెంకటేష్




న్యూఢిల్లీ: బీజేపీ, బీఆర్ఎస్ మధ్య అంతర్గతంగా ఏ రకంగా ఒప్పందాలు జరుగుతున్నాయో రానున్న కాలంలో మీడియా మిత్రులు, అందరూ గమనిస్తారని పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ అన్నారు. బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్నటువంటి రాజకీయ పరిస్థితుల్లో బీఆర్ఎస్ గెలిచే స్థానాలలో బీజేపీ అంతర్గతంగా మద్దతు ఇస్తుందని... అలాగే బీజేపీ గెలిచే స్థానాలలో బీఆర్ఎస్ అంతర్గతంగా మద్దతు ఇస్తుందని భావిస్తున్నానని అన్నారు. తాను పార్టీ మారడానికి కారణాలు ముందే వివరించానని ఓ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు ఎంపీ సమాధానం ఇచ్చారు. తన నియోజకవర్గానికి సేవ చేయడం కోసం 18 ఏళ్ల సర్వీస్ వుండగానే రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చానని వెంకటేష్ తెలిపారు. తొలుత కాంగ్రెస్‌లో చేరి చెన్నూర్ నుంచి పోటీ చేసి ఓడిపోయానని, తర్వాత టీఆర్ఎస్ నుంచి పెద్దపల్లి ఎంపీగా గెలిచానని చెప్పారు. ఈరోజు బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలు, ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న పరిణామాల కారణంగా ఆ పార్టీకి రాజీనామా చేశానన్నారు. పెద్దపల్లి ఎంపీగా రాష్ట్ర సమస్యలపై గళం బలంగా వినిపించానని, ఐదేళ్లు బీజేపీతో యుద్ధం చేసిన బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు అదే పార్టీతో చేతులు కలపడం తనకు నచ్చలేదని.. బాధించిందన్నారు. అందుకే తనకు రాజకీయ జన్మనిచ్చిన కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. దేశాన్ని జాతి, మతం, కులం ఆధారంగా విభజిస్తున్న బీజేపీని వ్యతిరేకిస్తూ రాహుల్ గాంధీ చేస్తున్న భారత్ జోడో వంటి కార్యక్రమాలు తనను ప్రేరేపించాయని వెంకటేష్ తెలిపారు.

# 'పొమ్మనలేక పొగపెడుతున్నారు'.. బీజేపీకి బాబుమోహన్ రాజీనామా



హైదరాబాద్, ఫిబ్రవరి 7: బీజేపీకి మాజీ మంత్రి బాబుమోహన్ రాజీనామా చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తనను వాడుకుని బీజేపీ పొమ్మనలేక పొగ పెడ్తోందని ఆరోపణలు చేశారు. ఆందోల్ నియోజకవర్గం నుంచి 2018, 2023లో బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా బాబుమోహన్ పోటీ చేశారు.

**అందుకే రాజీనామా..** తాజాగా వరంగల్ ఎంపీ టికెట్ బాబుమోహన్ ఆశించారు. అయితే వరంగల్ టికెట్ బాబుమోహన్‌కు ఇచ్చేందుకు కమలంపార్టీ నిరాకరించింది. దీంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ బీజేపీకి బాబు మోహన్ గుడ్‌బై చెప్పేశారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఆందోల్ టికెట్‌ను బాబుమోహన్ కుమారుడు ఉదయ్ మోహన్‌కు ఇ వ్వాలని బీజేపీ భావించింది. అయితే తమ కుటుంబంలో బీజేపీ చిచ్చు పెడుతోందని మాజీ మంత్రి ఆరోపించారు. దీంతో బీజేపీ చివరి నిమిషంలో ఆందోల్ టికెట్‌కు బాబూమోహన్‌కు ఇచ్చిన విషయం తెలిసిందే.

# హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు నో వర్రీస్...

హైదరాబాద్, ఫిబ్రవరి 7: హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు ఇబ్బంది లేకుండా ముందుకు వెళ్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జీహెచ్‌ఎంసీ రివ్యూ మీటింగ్ అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... జీహెచ్‌ఎంసీలో అన్ని అంశాలపై సుదీర్ఘంగా సమీక్షా సమావేశం నిర్వహించామని తెలిపారు. జీహెచ్‌ఎంసీ అభివృద్ధిపై ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు.

వచ్చే సమ్మర్‌లో నీటి ఎద్దడికి ఎలాంటి సమస్య లేదన్నారు. త్రాగునీటి సమస్య లేకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేశామని చెప్పారు. జీహెచ్‌ఎంసీలో రెవెన్యూ పెంచుకోవడానికి ప్రత్యేక పాలసీతో ముందుకు వెళ్ళబోతున్నామన్నారు. మూసీ అభివృద్ధికి ఎలాంటి ఆటంకం కలుగకుండా చర్యలు ఉంటాయని మంత్రి తెలిపారు.

**కేంద్రాన్ని కలుపుకుని వెళ్తాం...** అర్బన్ అభివృద్ధి కోసం కేంద్రం సహకారం తీసుకునే ఆలోచనలో తమ ప్రభుత్వం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో తమకు ఎలాంటి విభేధాలు లేవని... అభివృద్ధిలో కేంద్రాన్ని కలుపుకొని వెళ్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్ అభివృద్ధిపై రోజూ వారీగా సమీక్షలు ఉంటాయని... సమస్యలపై రిపోర్ట్ తయారీ ఉంటుందని తెలిపారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో అధికారులు అలర్ట్‌గా ఉండాలని సూచన చేశామన్నారు. అప్పులు – ఆస్తులు అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం తరహాలో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు నిధుల కేటాయింపు ఉంటుందన్నారు. జీహెచఎంసీ సమస్యలపై ప్రత్యేక నివేదిక తయారు చేయాలని ఆదేశించామన్నారు. డబుల్ బెడ్ రూమ్‌లపై త్వరలోనే ప్రభుత్వం పాలసీ ప్రకటన చేస్తుందన్నారు. జీహెచ్‌ఎంసీ త్రాగునీటి అంశంలో రాజకీయ అపోహలు మాత్రమే అని... ఎలాంటి సమస్యలు లేవన్నారు. వచ్చే సమ్మర్‌లో సిటీలో త్రాగునీటి సమస్య ఉత్పన్నం కాదన్నారు. అధికారుల సమన్వయం కోసం ప్రత్యేకంగా ఓఎస్‌డీని నియమిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com